

హైలెవల్ ఛానల్‌లో గుర్రపుడెక్క

- అధ్వానంగా సాగునీటి కాల్వలు
- నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- డెల్టా పరిధిలోని కాల్వలకు స్వల్పకాలిక టెండర్లు
- ప్రతిపాదనల దశ దాటని సాగర్ కుడి కాల్వల బాగు

మరమ్మతులు జరిగేనా?

సాగునీరు పారాల్సిన కాల్వలు.. తూటికాడ, జమ్ము, రబ్బరు మొక్కలతో నిండిపోయాయి. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చివరి భూములకు సాగునీరు అందించాల్సిన కాల్వలు పూడికతో నిండిపోయాయి. సాగునీటి కాల్వల కట్టలు కోతకు గురై ఉన్నాయి. సాగునీరు సక్రమంగా అందక పంటలు ఎండిపోతున్నా పాలకులకు పట్టలేదు. ఐదేళ్లు అటు వర్షాభావం.. ఇటు అరకొర ఉన్న సాగునీరు కాల్వల ద్వారా సక్రమంగా అందక రైతులు అల్లాడి పోయారు. అయినా పాలకులు కాల్వల మరమ్మతుల గురించి పట్టించు కోలేదు.. రైతుల గోడు ఆలకించలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం లో అయినా సాగునీటి కాల్వల బాగుపై దృష్టి సారిస్తారని రైతులు ఆశిస్తు న్నారు. ఖరీఫ్‌కు సాగునీటి ఇబ్బందులు లేకుండా కనీసం తాత్కాలిక మరమ్మతులు తక్షణం చేయాలని రైతులు కోరుతున్నారు.



కొమ్మమూరు కాల్వలో కోతపడిన కట్ట వెంట వేసిన ఇసుక మూటలు



కాల్వలో నీటి ఉధృతికి కొట్టుకుపోతున్న గుర్రపు డెక్క

గతంలో పనులు చేయకుండానే దోచేశారు

ఖరీఫ్ సీజన్ వస్తుందంటే మూడు నెలల ముందు నుంచి డెల్టా కాల్వల మరమ్మతులు, అత్యవసర మరమ్మతులు పూర్తిచేసే పనిలో నీటిపారుదల శాఖ తలమునకలై ఉండేది. కానీ గత నాలుగు సీజన్లలో ఒక్కపని కూడా లేదు. ప్రభుత్వం రైతుల కోసం కేటాయిస్తానన్న నిధుల మాట అటుంచితే, అత్యవసర పనులు చెయ్యాల్సిన తరుణంలోనూ మొండిచెయి చూపుతూ వచ్చింది. గతంలో సాగునీటి కాల్వల మరమ్మతుల కోసం సాధారణ నిధులు, ప్రత్యేక మరమ్మతుల కోసం నిధులను ప్రభుత్వం విడుదల చేసేది. ఇవేకాక ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్(ఓఅండ్ఎం) కింద కూడా కొన్ని నిధులు మంజూరు చేసేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక అవన్నీ పోయి చివరకు ఓఅండ్ఎం నిధులే దిక్కయ్యాయి. అవికూడా విదిలింపులే ఉండటంతో పనులు జరిగిన పరిస్థితి లేదు. ఆ కొద్దిపాటి నిధులను కూడా కాల్వలు ఖాళీగా ఉన్నప్పుడు కాకుండా, కాల్వలకు నీరు వదిలే సమయంలో విడుదల చేసి, హడావిడి చేసినట్లు చూపించి, చివరకు వాటిలో 80 శాతం నిధులు ఆ పార్టీ నేతలే కాంట్రాక్టర్‌లుగా అవతారమెత్తి దోచేసిన సందర్భాలున్నాయి. గత ఖరీఫ్ సీజన్‌లోనూ రూ.22 కోట్లు ప్రభుత్వం ఓఅండ్ఎం కింద మంజూరు చేస్తే, వాటిలో తూటుకాడ తొలగింపు, పూడికతీత పేరుతో మొత్తం దోచేశారు.





పల్నాడులో కాల్వలు కనిపించనంతగా పెరిగిన కంప చెట్లు

రూ.22.54 కోట్ల ప్రతిపాదనలతో సరి

నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో మేజర్లు, మైనర్లు, సబ్ మైనర్ కాల్వలు అధ్వానస్థితికి చేరుకున్నాయి. డ్రాపులు పగిలిపోయాయి. షట్టర్లు కూడా దెబ్బ తిన్నాయి, చాలా మైనర్లకు నీటిని సరఫరా చేసే తూములకు కనీసం షట్టర్లు కూడా లేవు. దీంతో నీటి సర ఫరాలో నియంత్రణ ఉండటంలేదు. సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. మరమ్మతులకు జలవ నరుల శాఖ రూ.22.54 కోట్లతో ప్రతిపాదనలు పంపింది. మరమ్మతులు తప్పనిసరి అయినా ప్రభుత్వం నిధులు విడుదల ఊసెత్తకపోతుండటంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినుకొండ, లింగంగుంట్ల, సత్తెనపల్లి డివిజన్లలో అత్యవసర మరమ్మతులకు సంబంధించి 473 పనులను గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు రూ22.54 కోట్లు వ్యయం అంచనా వేశారు. ఈ పనులపై ఇటీవల మంత్రి నిమ్మల సమీక్షించినా నేటి వరకు నిధులు కేటాయింపులు లేవు.

నరసరావుపేట, తెనాలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దెబ్బతినిపోయి గండ్లు పడటానికి సిద్ధంగా ఉన్న కాల్వ కట్టలు. కాల్వల్లో సాగునీరు కిందికి పోకుండా కమ్మేసిన గుర్రపుడెక్క. షట్టర్లకు రంధ్రాలు పడి, చెక్కలు అడ్డుపెట్టినా వృథాగా పోతున్న సాగునీరు. ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఉన్న సాగునీటి కాల్వలు, డ్రెయిన్ల దుస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో ఈ ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు చివరి భూములకు చేరడం కష్టమే. నీటి విడుదల ఆలస్యమైనా, నీరు చివరి వరకు చేరకున్నా పంట దిగుబడులపై ప్రభావం చూపే పరిస్థితి. అయినా నాటి పాలకులు సాగునీటి వ్యవస్థ గురించి కనీసంగా కూడా ఆలోచించలేదంటే ఆశ్చర్యం కాదు. డెల్టా పరిధిలో గత నాలుగు సీజన్లలో ఒక్క పనికూడా జరిగిన దాఖలాలే లేవు. దీంతో సాగునీటి కష్టాలు మరింత పెరిగిపోయాయి. చుక్కనీరు చివరి భూమి వరకు వెళ్లాలంటే ఒక ప్రహసనమే. కేవలం చిల్లర విదిలింపులతో అప్పటి వైసీపీ సర్కారు సరిపెట్టింది. దీంతో ఒక్క గండీ పూడ్చలేని పరిస్థితి. కాల్వ కట్టలు దెబ్బతినిపోయినా, గండ్లు పడినా, చివరి భూములకు నీరు అందకపోయినా అడిగే దిక్కేలేదు. అప్పట్లో ఓఅండ్ఎం నిధులే దిక్కు. అవికూడా ప్రతిపాదనలు పంపినంత కాకుండా వారికి తోచినంత ఇచ్చి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. సాగునీరు చివరి భూముల వరకు అందాలంటే కాల్వలే కీలకం. అయితే ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ కాల్వలు గత నాలుగేళ్లగా అధ్వానంగా మారిపోయాయి. పట్టించుకునే దిక్కులేక, దెబ్బతిన్న కట్టలను బాగుచేసేవారులేక, షట్టర్లు తుప్పు పట్టిపోయిన పరిస్థితి. ఇక కాల్వల్లో నీరు ప్రవహించడానికి దారిలేదన్నట్టు పిచ్చిచెట్లు, ముళ్ల కంపలు, తూటుకాడ, గుర్రపు డెక్క పెరిగిపోయి అడ్డుగా మారిపోయాయి. ప్రస్తుతం ఆశాజనకంగా వర్షాలు పడుతున్నాయి. జలాశయాలకు పుష్కలంగా నీరు వస్తోంది. ఈ పరిస్థితుల్లో సాగునీటి కాల్వల మరమ్మతుల విషయంలో దేనినీ ఆలస్యం చేయడానికి వీలులేదు. మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేసేందుకు ప్రభుత్వం సత్వరం చర్యలు తీసుకోవాలి. ఐదేళ్లుగా సాగర్ పరిధిలోని కాల్వల్లో పూడిక తీత నోచుకోలేదు. కూటమి ప్రభుత్వంలో ఇటీవల మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్షించగా.. పనులు నిర్వహణ ప్రతిపాదనలకే పరిమితమైంది. నిధుల విడుదలపై నేటి వరకు ఎటువంటి ప్రకటన వెలువడలేదు. ఈ ఏడాదికి కాలువలకు మరమ్మతులు లేనట్లేనన్న అభిప్రాయం అధికారుల నుంచి వ్యక్తమవు తోంది. కాలువలు బాగు చేయకపోతే సాగునీటి పారుదలకు ఇబ్బందులు ఏర్పడతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక కృష్ణా పశ్చిమ డెల్టా కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం ఇటీవల రూ.13.62 కోట్లు మంజూరు చేసింది. అయితే అటు పట్టిసీమ నీరు, ఇటు వర్షాలతో ప్రస్తుతం కాల్వల్లో నీరు పుష్కలంగా పారుదల అవుతుంది. దీంతో కాల్వల మరమ్మతులకు ఇబ్బందులు తప్పడంలేదు. కాల్వలకు సకాలంలో నీరొచ్చిందన్న ఆనందం కాల్వల ఎగువ భూముల రైతులకుంటే, చివరి భూముల రైతులు మాత్రం నీరు అందని పరిస్థితుల్లో మరమ్మతులు జరిగితే బాగుంటుందని ఎదురు చూస్తున్న పరిస్థితి.

డెల్టాలో పనులపై సందిగ్ధత

కృష్ణా పశ్చిమ డెల్టాలో అత్యవసర మరమ్మతుల కోసం ఈ సీజన్‌కు ప్రభుత్వం రూ.13.62 కోట్లు మంజూరు చేసింది. వీటితో డెల్టా కాల్వలు, డ్రెయిన్లలో అత్యవసరమనుకున్న 188 పనులు పూర్తి చేసేందుకు నీటిపారుదల శాఖ సన్నద్ధమయింది. కృష్ణా పశ్చిమ విభాగం పరిధిలో 85 పనుల కోసం రూ.4.98 కోట్లు, రేపల్లె, చీరాల డ్రెయినేజి డివిజన్‌ల పరిధిలో 98 పనులకు రూ.7.3 కోట్లు, గుంటూరు వాహిని కింద 5 పనుల కోసం రూ.1.31 కోట్లు కేటాయించారు. అయితే ఇప్పటికే కాల్వలకు నీరొచ్చేయటం, డెల్టాలో వరి సాగు వెద పద్ధతిలో మొదలవడంతో పనులు ఆచరణలో ఎంతవరకు సకాలంలో పూర్తవుతాయనేదే సందేహంగా మారింది. నీటిపారుదల శాఖ అధికారులు పనులను చిన్నవిగా విభజించి, స్వల్పకాలిక టెండర్లను పిలిచింది. అయితే కాంట్రాక్టర్ల మధ్య ఒప్పందం పూర్తై, వారు పనులు మొదలుపెట్టడానికి ఇంకా పక్షం రోజులు పట్టే పరిస్థితి. ఈ తరుణంలో పనులు సాగేతీరుపై సందిగ్ధత నెలకొంది.

కౌలు రైతులకు.. గుర్తింపేది

- మొక్కుబడిగానే సీసీఆర్ కార్డుల పంపిణీ
- జిల్లాలో 65 వేల కార్డులకు 23,699 మాత్రమే..
- రూ.206 కోట్ల పంట రుణాలకు రూ.3 కోట్లే మంజూరు
- కౌలు రైతులకు ఉపయోగపడని వ్యవసాయశాఖ రుణ ప్రణాళిక

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంటల సాగు చేసే వారిలో కౌలు రైతులే అధికం. అయితే సాగుభూమిలో సగానికి పైగా సేద్యం చేసే కౌలు రైతుల కష్టాలు తీరే దారి కనిపించడం లేదు. ప్రభుత్వం నుంచి రాయితీలు, సబ్సిడీలు, లబ్ధి భూయజమానులు పొందుతుండగా వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు కష్టాలు, నష్టాలు, అప్పులు మిగులుతున్నాయి. చివరకు పంటల సాగుకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణాలను కూడా కౌలు రైతులు పొందలేకపోతున్నారు. కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కౌలు రాయితీ కార్డులు(సీసీఆర్) కూడా దక్కడంలేదు. ఈ పరిస్థితుల్లో కౌలు రైతులకు చెప్పినట్లుగా ప్రభుత్వం పథకాలు అమలు చేయడంలేదు. ప్రధానంగా కౌలు రైతుల గుర్తింపునకు అవసరమైన సీసీఆర్ కార్డుల పంపిణీ ఏటా ప్రహసనంగా మారుతోంది. జిల్లాలో ఉన్న కౌలు రైతులకు పంపిణీ చేస్తున్న కార్డులకు పొంతన ఉండటం లేదు. జిల్లాలో 1.61 లక్షల మంది కౌలు రైతులు ఉన్నట్లు అంచనా. వీరికి రుణాలు, సాగు ప్రయోజనాల కోసం పంపిణీ చేసే సీసీఆర్ కార్డుల లక్ష్యం నామమాత్రమే. మొక్కుబడిగా సీసీఆర్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయశాఖ లెక్కలు తెలియ జేస్తున్నాయి. జిల్లాలో సొంత భూములు ఉన్న రైతుల కంటే కౌలురైతులే అధికంగా పత్తి సాగు చేస్తారు. పత్తి, మిరప కౌలుకు సంబంధించి ఒప్పందాలు పూర్తయ్యాయి. వరిసాగుకు సంబంధించి కౌలు ఒప్పందాలు జరుగుతున్నాయి. అయితే కౌలు రైతుల ను గుర్తించి వారికి సీసీఆర్ కార్డుల జారీ ప్రక్రియ మందకొడిగా సాగుతున్నది. కార్డుల జారీ జిల్లా లక్ష్యం 65 వేలు కాగా ఇప్పటికి 23,699 కార్డులు మాత్రమే జారీ చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. కౌలు రైతులకు రూ.206 కోట్లు పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. అయితే ఇప్పటికి రూ.3 కోట్లు మాత్రమే పంపిణీ చేశారు. ఖరీఫ్‌లో పంట రుణాలు రూ.13,211 కోట్లు ఇవ్వాలనే లక్ష్యంతో రుణ ప్రణాళికను లీడ్‌బ్యాంకు ప్రకటించింది. కౌలు రైతులకు 206 కోట్లు రుణాలు ఇవ్వాలని వ్యవసాయ శాఖ లక్ష్యం. అయితే పంట రుణాల కేటాయింపులను పరిశీలిస్తే 10 శాతం కౌలు రైతులకు ఇవ్వాల్సి ఉండగా కేవలం 1.5 శాతం మాత్రమే నిర్ధేశించ డం గమనా ర్హం. కౌలు రైతులపై ప్రభు త్వం వివక్ష చూపు తున్నదన్న విమర్శలున్నా యి. కార్డులు పంపిణీ చేసిన రైతులకు కూడా రుణ పంపిణీ ప్రారంభం కాలేదు. సాగు వ్యయం కోసం వడ్డీ వ్యాపారులను కౌలు రైతులు ఆశ్రయించాల్సి వస్తున్నది.



పొలం దున్నుతున్న రైతు

వడివడిగా.. కృష్ణమ్మ

- శ్రీశైలానికి పోటెత్తుతున్న వరద
- అంతకంతకు పెరుగుతున్న వరద
- సాగర్ జలాశయానికి నీటి విడుదల
- కుడి కాల్వ ఆయకట్టుకు సాగునీటి భరోసా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణమ్మ వడివడిగా వస్తోంది. శ్రీశైలం దిశగా పరుగులు పెడుతూ వస్తోంది. దీంతో అంతకంతకు జలాశయానికి వరద నీరు పోటెత్తుతోంది. దాదాపు 2.46 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోంది. ఇది క్రమంగా మూడు లక్షల క్యూసెక్కులు దాటే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీశైలానికి 10 రోజుల వరకు వరద ప్రవాహం కొనసాగుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. ఇప్పటికే 110 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నాగార్జునసాగర్ జలాశయానికి శుక్రవారం నీటిని విడుదల చేశారు. నాలుగు రోజుల్లో సాగర్ జలాశయానికి కూడా భారీగానే వరద నీరు వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో కుడికాల్వ ఆయకట్టుకు సాగునీటి భరోసా వస్తోంది. గత ఏడాది వరి సాగు కోల్పోయిన రైతుల్లో ఈ ఏడాది ఆశలు చిగురిస్తున్నాయి. కృష్ణానది పరివాహక ప్రాంతంలో గత రెండు రోజుల్లో 600 మీమీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ ప్రకటించింది. దీంతో ఆల్‌మట్టి, తుంగభద్ర జలాశయాలకు వరద నీటి ప్రవాహం పెరగనున్నది. ఇప్పటికే శ్రీశైలం ఎగువ ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నీటి నిల్వ చేరింది. దీంతో ఆయా జలాశయాలకు వస్తున్న వరదనీటిని దిగువకు వదిలేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి వరద నీరు రెండు రోజుల్లో రానున్నది. నారాయణపూర్ జలాశయానికి వస్తున్న నీటిని అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. మొత్తం 3.12 లక్షల కూసెక్కుల నీరు శ్రీశైలానికి రానున్నది. శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తూ సాగర్‌కు 30,784 క్యూసెక్కుల నీరు వస్తున్నది. తాగునీటి అవసరాలకు కుడి కాల్వకు సాగర్ నుంచి 6,990 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



శ్రీశైలం జలాశయానికి జలకళ

జలాశయాల్లో నీటి నిల్వల వివరాలు...

జలాశయం	పూర్తి స్థాయి నీటి నిల్వ టీఎంసీలలో	ప్రస్తుత నిల్వ టీఎంసీలలో	వస్తున్న వరద నీరు క్యూసెక్కుల్లో	విడుదల చేస్తున్న నీరు క్యూసెక్కుల్లో
ఆల్మట్టి	123.08	83.48	2,04,098	2,66,586
నారాయణపూర్	33.31	26.85	2,61,397	2,65,494
జూరాల	9.66	5.99	2,24,083	2,26,375
తుంగభద్ర	105.78	96.25	87,766	84,149
శ్రీశైలం	215.81	110.47	2,46,965	31,784
నాగార్జున సాగర్	312.05	123.34	29,589	6,990
పులిచింతల	45.77	1.03	276	50

టిడ్కో.. గందరగోళం

- ఇళ్ల కంటే అదనంగా లబ్ధిదారులు
- అధికారులకు తలనొప్పిగా మారిన పంపిణీ
- ఏళ్లు గడుస్తున్నా ఇళ్ల కేటాయింపులో కొరవడిన స్పష్టత

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేటలో టిడ్కో ఇళ్లు నిర్మించి.. వసతులు కల్పించారు. అయితే ఏళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. సొంత ఇంటి కోసం ఏళ్ల తరబడి లబ్ధిదారులు ఎదురు చూస్తున్నా వీరి మొర ఆలకించే వారే కరువయ్యారు. నరసరావుపేట మున్సిపాల్టీలో పేదలకు గృహాలు ఎప్పటికి పంపిణీ చేస్తారో అధికారులకే స్పష్టత లేదు. నిర్మించిన గృహాల కన్నా అధికంగా లబ్ధిదారుల నుంచి వాటా ధనం వసూలు చేశారు. దీంతో ఎవరికి ఇంటిని కేటాయించాలో తెలియక పంపిణీ నిలిచిపో యింది. 2018లో టీడీపీ ప్రభుత్వం హయాంలో 1504 గృహాలను నరసరావుపేటలో నిర్మించారు. అప్పట్లోనే లబ్ధిదారులను ఎంపిక చేసి ఒక్కొక్కరి నుంచి వాటా ధనంగా రూ.50 వేల ను మున్సిపాల్టీ వసూలు చేసింది. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలుత ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో కొందరి పేర్లను తొలగించారు. వారి స్థానంలో వైసీపీ వ్యక్తులకు దాదాపు 290 ఇళ్లను కేటాయించారు. సదరు లబ్ధిదారుల నుంచి కూడా రూ.25 వేలు చొప్పున వాటా ధనంగా మున్సిపాల్టీ వసూలు చేసింది. టీడీపీ హయాంలో ఎంపిక చేసి, ఆ తర్వాత రద్దు చేసిన లబ్ధిదారులకు వారు చెల్లించిన వాటా ధనం రూ.50 వేలు తిరిగి మున్సిపాల్టీ చెల్లించ లేదు. దీంతో సదరు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించి ఐదు పిటిషన్లను దాఖలు చేశారు. దీంతో పాత లబ్ధిదారులకే ఇళ్లు కేటాయించాలని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. అయినా అధికారులు సదరు పేదలకు ఇంటిని కేటాయించే విషయంలో నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. సుమారు 580 మంది లబ్ధిదారులు వాటా ధనం చెల్లించి ఇంటి కోసం ఎదురుచూస్తు న్నారు. సదరు వ్యక్తులు మున్సిపల్ కార్యాల యం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇంటి కేటాయింపు విషయంలో అధికారులు వారికి సమాధానం ఇవ్వక పోతుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు.



పంపిణీకి నోచుకోని నరసరావుపేటలోని టిడ్కో గృహాలు

నిరుపయోగంగా వందల ఇళ్లు

లబ్ధిదారుల ఎంపికలో జరిగిన లోపాలతో వందలాది ఇళ్లు నిరుపయోగంగా మారాయి. మొత్తం 1504 గృహాలను టిడ్కో నిర్మించి మున్సిపాల్టీకి అప్పగించింది. వీటిలో 529 గృహాలను ఇప్పటి వరకు లబ్ధిదారులకు అప్పగించారు. 645 గృహాలను రిజిస్ట్రేషన్ చేశారు. 861 గృహాలకు బ్యాంకుల నుంచి రుణాలు లబ్ధిదారుల పేరుపై మంజూరయ్యాయి. ఇంట్లో నివాసం ఉండకుండానే ఈఎంఐలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. 643 గృహాల కేటాయింపు జరగలేదు. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన 290 గృహాల కేటాయింపు సందిగ్ధంలో పడింది. అధికారులు నిబంధనలు, కోర్టు ఉత్తర్వులు పరిగణనలోకి తీసుకుని అర్హులకు ఇళ్లు అప్పగించేందుకు చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇంటిని కేటాయించగా మిగిలిన సుమారు 290 మందికి వారు చెల్లించిన వాటా ధనం తిరిగి చెల్లిస్తే ఇళ్ల సమస్య ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

ఓయూ కళాశాలల్లో బీఈ/బీటెక్ లేటరల్ ఎంట్రీ

దిక్సూచి
DIKSUCHI



హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ)- బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో లేటరల్ ఎంట్రీకి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. 'కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీప్)' కింద నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రామ్‌లను ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఈ/బీటెక్ రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. యూనివర్సిటీ క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజ్ సహా వర్సిటీ అనుబంధ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రతి కళాశాలలో స్పెషలైజేషన్‌కు 30 సీట్లు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఈ ప్రోగ్రామ్‌లకు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు ఉంటాయి. వారాంతాలు, సెలవు రోజుల్లో కూడా అందరి సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని క్లాసెస్ నిర్వహిస్తారు. సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు రూ.50,000. వర్సిటీ నిబంధనల మేరకు ఇతర ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.

అర్హత: ఏదేని గుర్తింపు పొందిన బోర్డు నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. చేరదలచుకున్న ఇంజనీరింగ్ కాలేజీకి 100 కి.మీ.ల పరిధిలో ఉన్న కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు, ఎంఎస్ఎంఈ పరిశ్రమలు/సంస్థల్లో పని చేస్తూ ఉండాలి. కనీసం ఏడాది అనుభవం తప్పనిసరి.

ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో స్పెషలైజేషన్‌కు సంబంధించి మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 36 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 15 శాతం మార్కులు రావాలి. పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 27
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** డిప్లొమా సర్టిఫికెట్-మార్కుల పత్రాలు, టీసీ, మైగ్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, పదోతరగతి సర్టిఫికెట్, ఆరోతరగతి నుంచి డిప్లొమా వరకు స్టడీ సర్టిఫికెట్లు, సర్వీస్ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, జిరాక్స్ కాపీలు, రెండు ఫొటోలు.
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** ఆగస్టు 4
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 8
- **మొదటి ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 17
- **రెండో ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 24
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/7kP3x2Cలో చదవండి.

కోటక్ కన్య స్కాలర్‌షిప్

కోటక్ మహీంద్రా గ్రూప్ కంపెనీలు, కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'కోటక్ కన్య స్కాలర్‌షిప్ 2024-25' నోటిఫికేషన్ వెలువడింది. ప్రతిభావంతులైన బాలికలను ఉన్నత విద్యలో ప్రోత్సహిస్తూ వారికి ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కాలర్‌షిప్‌ను ఉద్దేశించారు. కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండో తరగతి పూర్తిచేసి గుర్తింపు పొందిన కాలేజీల్లో ఇంజనీరింగ్/మెడిసిన్/బీడీఎస్/ఫార్మసీ/ఆర్కిటెక్చర్/డిజైనింగ్ విభాగాల్లో డిగ్రీ ప్రవేశం పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ, బీఎస్సీ నర్సింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరినవారు; బెంగళూరు ఐఐఎస్సీ, ఐసర్ సంస్థల నుంచి ఇంటిగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్ అడ్మిషన్ పొందినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.6 లక్షలు మించకూడదు. ఎంపికైన బాలికలకు ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, ఇంటర్నెట్, ల్యాప్‌టాప్, బుక్స్, స్టేషనరీ ఖర్చుల కింద ఏడాదికి రూ.లక్షన్నర ఇస్తారు. వార్షిక పరీక్షల్లో కనీసం 6 సీజీపీఏ సాధించేవారికి కోర్సు పూర్తయ్యేవరకూ స్కాలర్‌షిప్ కొనసాగిస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **వెబ్‌సైట్:** www.kotak.com, www.b4s.in/it/kkgs2


పోటీ నీకే - జయం నీదే

కొత్త పుస్తకం

పోటీ పరీక్షలు అంటే గ్రామీణ యువతలో విపరీతమైన క్రేజ్ ఉంటుంది. అయితే వీరిలో ఎక్కువ మంది గ్రూప్స్, టీచర్ వంటి ఉద్యోగాల పట్ల దృష్టిపెడతారు కానీ సివిల్స్ గురించి ఆలోచించరు. రాయాలని ఉన్నా అవి పెద్ద పెద్ద పట్టణాల్లో చదువుకున్నవారికి లేదా టాప్ ర్యాంకర్లకు ఉద్దేశించిన ఉద్యోగాలని భావిస్తుంటారు. అలాంటి వారికి మార్గనిర్దేశం చేసేందుకు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రావులపాటి సీతారామారావు 'పోటీ నీకే - జయం నీదే' పేరుతో పుస్తకం రాశారు. ఏదో పనిమీద బయటకు వెళ్లినప్పుడు తనను కలిసిన విద్యార్థులు, ఉద్యోగార్థులు పలు సందేహాలు వెలిబుచ్చేవారు. తను వారికి ఇచ్చిన గైడెన్స్ అందరికీ చేరాలనే ఉద్దేశంతో రచయిత ఈ పుస్తకం రాశారు.

విజయం సాధించాలంటే పెద్ద బ్యాక్‌గ్రౌండ్ ఉండాల్సిన పనిలేదు. ఒక గమ్యాన్ని నిర్దేశించుకుని, దాని కోసం క్రమపద్ధతిలో కష్టపడాలని చెబుతారు. పోటీ పరీక్షల కోసం ప్లానింగ్ ఎలా చేసుకోవాలి? ఎన్ని గంటలు చదవాలి? పరీక్షల కోసం సిద్ధమయ్యే వారికి మెంటార్ అవసరమా? అని చెబుతూ తనతో సహా గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు సివిల్స్ వంటి పరీక్షల్లో ఎలా విజయం సాధించారో స్ఫూర్తి కలిగించేలా సవివరంగా చెప్పారు సీతారామారావు. పరీక్షలు రాసే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని అధిగమించిన తీరును పుస్తకంలో వివరించారు. పరీక్షలకు సిద్ధంకావడానికి ముందే అకడమిక్ పరీక్షలకు, పోటీ పరీక్షలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టంగా గ్రహించగలగాలి. చదువుకోవడానికి మూడ్ ఉండాలి, వారం-వర్జ్యం లాంటివి చూసుకోవాలనే మూఢనమ్మకాలు దరిచేరనీయ వద్దు. లక్ష్యం పెద్దగా నిర్ణయించుకున్నప్పుడు అందుకు అనుగుణంగానే ప్రిపేర్ కావాలి అని చెబుతారు. సెల్ఫ్ మోటివేషన్ పొంద డానికి ఏమి చేయాలి? కొంత మంది సివిల్స్ అభ్యర్థులు ఎలా మోటివేట్ అయ్యారు అని వివరించారు. ఇవి సివిల్స్ అభ్యర్థులకు మాత్రమే కాకుండా అన్ని పరీక్షల విద్యార్థులకు ఉపయోగపడతాయి. ఈ పుస్తకాన్ని సాహితి ప్రచురణలు వారు ప్రింట్ చేశారు.

వెల: రూ.90/-
ప్రతులకు: సాహితి ప్రచురణలు 33-22-2, చంద్రం బిల్డింగ్స్, సి.ఆర్.రోడ్, చుట్టుగుంట, విజయవాడ-520 002.
ఫోన్: 8121098500



నవ్య | చిత్రజ్యోతి

ఆ పాటలో కేసీఆర్‌ను తలుచుకున్నామంతే!



రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోని 'మార్ ముంతా ఛోడ్ చింతా' పాట వివాదంపై సంగీత దర్శకుడు మణిశర్మ స్పందించారు. ఆ పాటలో 'ఇప్పుడేం చేద్దాం' అంటూ కేసీఆర్ అన్న మాటను ఉపయోగించడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహించాయి. ఇటీవల ఇచ్చిన ఈ పాట గురించి ఇచ్చిన వీడియో ఇంటర్వ్యూలో మణిశర్మ వివరణ ఇస్తూ 'సోషల్ మీడియాలో వచ్చే మీమ్స్ ఆధారంగా ఆ పాట ఉంటుంది. కేసీఆర్ అంటే అందరికీ గౌరవం. ఆయన సరదాగా చెప్పిన ఓ పదాన్ని ఇందులో తీసుకున్నామంతే. ఎవరినీ నొప్పించడం మా ఉద్దేశం కాదు. నా 27 ఏళ్ల కెరీర్‌లో ఎవరినీ నొప్పించలేదు. ఆ పాటలో కేసీఆర్‌ను ఒకసారి తలచుకున్నాం. కేవలం అది వినోదం కోసమే. దయచేసి అందరూ అలాగే భావించండి' అన్నారు. 'డబుల్ ఇస్మార్ట్' లోని మూడో పాట 'క్యా లఫ్డా' ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన రామ్, హీరోయిన్ కావ్యా థాపర్ పోస్టర్ రొమాంటిక్‌గా ఉంది. ఆగస్టు 15న 'డబుల్ ఇస్మార్ట్' విడుదల కానుంది.

మనవడి స్కూలుకు రజనీ



పాఠశాలకు వెళ్లేందుకు మారాం చేసిన తన మనవడిని తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ స్వయంగా స్కూల్‌కు తీసుకెళ్ళి వదిలిపెట్టారు. మనవడితో కారులో రజనీ స్కూల్‌కు వెళుతున్న ఫోటోను ఆయన చిన్న కుమార్తె సౌందర్య శుక్రవారం సామాజికా మాధ్యమాల్లో షేర్ చేస్తూ.. 'ఈ రోజు నా కుమారుడు స్కూల్‌కు వెళ్ళనని మొండికేయడంతో వాడి సూపర్ హీరో తాత (రజనీ) పాఠశాలకు స్వయంగా తీసుకెళ్లారు. వెండితెర అయినా, నిజజీవితంలో అయినా ఎలాంటి పాత్రనైనా నా తండ్రి అద్భుతంగా పూర్తి చేస్తారు' అని పేర్కొన్నారు. కాగా, సౌందర్య కుమారుడు వేద్‌ను పాఠశాల తరగతి గదిలోకి తీసుకెళ్ళిన రజనీకాంత్‌ను ఇతర పిల్లలు సంభ్రమాశ్చర్యాలతో చూశారు. వెండితెరవేల్పు రజనీ తమ కళ్లముందు ప్రత్యక్షమవ్వడంతో వారి ఆనందానికి హద్దే లేకుండాపోయింది. ఇదిలావుంటే, 'వేట్టయాన్' సినిమా పూర్తి చేసిన రజనీకాంత్ ఇపుడు లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 'కూలీ' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌లో గ్యాప్ లభించడంతో ప్రస్తుతం ఆయన స్థానిక పోయెస్ గార్డెన్‌లో ఉన్న తన నివాసంలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి, (చెన్నై)

షారుక్ ఖాన్ రూ.40 కోట్లు.. అమితాబ్ రూ.30 కోట్లు...

అనంత్ అంబానీపై సినీ సెలెబ్రిటీల కానుకల వర్షం...



ఆభరణాల సెట్
అమితాబ్ బచ్చన్ దంపతులు, అభిషేక్, ఐశ్వర్య కలసి ఈ వధూవరులకి రూ.30 కోట్ల విలువైన ఆభరణాల సెట్‌ను (పచ్చల హారాన్ని) బహుమతిగా ఇచ్చారు.



ఇటీవలే అంగరంగ వైభవంగా జరిగిన అనంత్ అంబానీ, రాధిక మర్చంట్‌ల వివాహం.. ప్రపంచవ్యాప్తంగా జరిగిన అత్యంత ఖరీదైన పెళ్లిల్లో ఒకటిగా నిలిచిపోయింది. ఈ చిరకాల వేడుకకు అంబానీ కుటుంబం చేసిన హంగామాని ప్రజలు కలకాలం గుర్తుంచుకుంటారు. ఆకాశంలో చంద్రుడు చుట్టూ ఉన్న అసంఖ్యాక తారల్లా.. అంబానీ పెళ్లిలో అనేక రంగాల్లోని అగ్ర తారలందరూ సందడి చేసి దేదీప్యమానంగా వెలుగులు విరబూశారు. ఈ విలాసవంతమైన పెళ్లికి అదిరిపోయే రేంజ్‌లో అత్యున్నతమైన ఏర్పాట్లకు తోడు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ తారలు హాజరవడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకకు వచ్చిన కొందరికి అంబానీ కుటుంబం అతిథి మర్యాదలతో దాదాపు రూ.రెండు కోట్ల విలువ చేసే వాచీలను గిఫ్ట్‌గా ఇచ్చారు. అలాగే సినీ సెలబ్రిటీలు కూడా ఈ కొత్త జంటకు కానుకలు అందించడానికి క్యూ కట్టడం విశేషం. మిగతా పరిశ్రమల నటీనటులు ఏయే బహుమతులు ఇచ్చారో తెలియదు కానీ.. బాలీవుడ్ తారలు ఇచ్చిన బహుమతుల వివరాలు ఒక్కొక్కటే బయటకు వస్తున్నాయి. ఎవరు ఏమేమిచ్చారో ఇప్పుడు తెలుసుకుందాం.



రూ.40 కోట్ల విల్లా
బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ ఈ నూతన జంటకు ఫ్రాన్స్‌లో రూ.40 కోట్లు ఖరీదు చేసే ఓ విలాసవంతమైన భవంతిని కానుకగా ఇచ్చారు.




రూ.20 కోట్ల రోల్స్ రాయిస్
'కల్కి 2898 ఏ.డీ'తో తెలుగువారికి చేరువైన దీపికా పదుకొనే, తన భర్త రణ్‌వీర్ రూ.20 కోట్లు పెట్టి ఓ రోల్స్ రాయిస్ కారును వెడ్డింగ్ ప్రజంటేషన్‌గా ఇచ్చారు.



రూ.15 కోట్ల బైక్
సల్మాన్ ఖాన్ రూ.15 కోట్ల విలువైన స్పోర్ట్స్ బైక్‌ను కానుకగా ఇచ్చారు.

రూ.తొమ్మిది కోట్ల మెర్సిడెస్
రణ్‌బీర్ కపూర్, అలియా భట్ జంట ఈ కపుల్‌కు రూ.తొమ్మిది కోట్ల విలువైన మెర్సిడెస్ కారును గిఫ్ట్‌గా ఇచ్చారు.









వీరితో పాటు, అక్షయ్ కుమార్ రూ.60 లక్షలు విలువ చేసే బంగారపు పెన్నును.. సిద్ధార్థ్ మల్హోత్రా, కియారా అద్వానీ దంపతులు రూ.25 లక్షలు విలువ చేసే హ్యాండ్ మేడ్ శాలువాను.. విక్కీకౌశల్, కత్రినా కైఫ్ దంపతులు రూ.19 లక్షల బంగారు గొలుసును బహూకరించారు.

మూడేళ్ల కష్టం.. కమిటీ కుర్రోళ్లు



అంతా కొత్తవారితో నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ట్రైలర్‌ను శుక్రవారం హీరో సిద్దు జొన్నలగడ్డ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చిన్న సినిమా, పెద్ద సినిమా అని ఉండదు. ఓ సినిమాకు ఎక్కువ ఖర్చు పెడతాం, మరో చిత్రానికి తక్కువ ఖర్చు పెడతాం.. తేడా అంతే. ఈ సినిమాలో విజువల్స్ బాగున్నాయి. కొత్తవారితో ఇంత మంచి చిత్రం తీయడం మాములు విషయం కాదు. దర్శకుడు యదు వంశీకి ఇదే మొదటి సినిమా అంటే నమ్మబుద్ధి కావడం లేదు. ఈ సినిమా హిట్ అయి అందరికీ లాభాలు తేవాలి' అని కోరారు. చిత్ర సమర్పకురాలు నిహారిక మాట్లాడుతూ 'మూడేళ్ల కష్టం ఈ సినిమా. వీరంతా మూడేళ్లుగా పని చేస్తునే ఉన్నారు. అంతా కష్టపడి మంచి సినిమా చేశాం. ఆగస్టు 9న సినిమాను విడుదల చేస్తున్నాం' అని చెప్పారు. 'మా సినిమాలో నటించిన 11 మంది సిద్దులాగా ఎంతో కష్టపడుతుంటారు. మా టెక్నికల్ టీమ్ సపోర్ట్‌తో సినిమాను బాగా తీయగలిగాను. నిహారిక, ఫణి లేకపోతే చిత్రం ఇలా వచ్చేదే కాదు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేశ్ సహకారం మరువలేనిది' అని చెప్పారు దర్శకుడు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తీసిన యూత్‌ఫుల్ మూవీ ఇదని నిర్మాత ఫణి అడపాక, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేశ్ చెప్పారు.

సస్పెన్స్ థ్రిల్లర్




కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా నటించిన చిత్రం 'జ్యూయల్ థీఫ్' సీనియర్ నటి ప్రేమ కీలక పాత్ర పోషించారు. పీఎస్ నారాయణ దర్శకత్వంలో మల్లెల ప్రభాకర్ నిర్మించారు. ఇటీవలే సినిమా టీజర్‌ని, ఆడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'నేను సూపర్‌స్టార్ కృష్ణగారి అభిమానిని. ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. ఈ తరం ప్రేక్షకులకు నచ్చే సస్పెన్స్ థ్రిల్లర్. త్వరలోనే విడుదల చేస్తాం' అని చెప్పారు.

'పావలా' శ్యామలకు సాయి దుర్గతేజ్ ఆర్థిక సాయం



ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న సీనియర్ నటి 'పావలా' శ్యామలకు హీరో సాయి దుర్గతేజ్ ఆర్థిక సాయం చేశారు.. తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యుల ద్వారా శ్యామలకు లక్ష రూపాయలు పంపించారు. శ్యామల ఎమోషనల్ అయి 'మా అమ్మాయికి ఆపరేషన్ అయినప్పుడు సాయి దుర్గతేజ్ ఫోన్ చేసి, ధైర్యం చెప్పారు. వచ్చి కలుస్తానన్నారు. చాలా రోజులైంది. మరిచిపోయారేమో అనుకున్నా. గుర్తు పెట్టుకుని సాయం చేసినందుకు ధన్యవాదాలు' అన్నారు.

వాణిజ్య హంగులతో విరాజి



వరుణ్ సందేశ్ కథానాయకుడిగా ఆద్యంత్ హర్ష తెరకెక్కించిన చిత్రం 'విరాజి'. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల మీడియాతో ముచ్చటించారు. 'గతంలో మా సంస్థలో వరలక్ష్మి శరత్‌కుమార్‌తో 'శబరి' చిత్రాన్ని నిర్మించాం. మేం నిర్మించిన రెండో చిత్రం 'విరాజి'. వరుణ్ సందేశ్ కొత్తలుక్‌లో కనిపిస్తారు. ఆయన గెటప్‌కు కథలో ప్రాధాన్యం ఉంది. మన సమాజంలోని ఒక అంశాన్ని తీసుకొని కమర్షియల్ కోణంలో సినిమాను తెరకెక్కించాం' అని మహేంద్రనాథ్ చెప్పారు.

విద్యార్థులకు వసతి సదుపాయం కల్పించాలి

● కేంద్ర మంత్రి మురుగన్‌ను కోరిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు



కేంద్ర మంత్రి మురుగన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

మాచర్లటౌన్, జూలై 26: మాచర్లలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో విద్యార్థులకు వసతిగృహం కల్పించాలని, పట్టణంలో ఖాళీగా ఉన్న భారత ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని భవనం లీజుకు అనుమతి ఇవ్వాలని కేంద్ర సమాచార ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్‌ను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి మురుగన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. హాస్టల్ సౌకర్యం కోసం ప్రభుత్వ భవనం లేకపోవడంతో వసతిగృహాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పట్టణంలోని వివిధ కళాశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన నిరుపేద బాలికలు విద్యనభ్యసిస్తున్నారని, వారికి భవనాల కొరత తీవ్రంగా ఉందని వివరించారు. మాచర్ల పట్టణంలో భారత ప్రసార మంత్రిత్వ శాఖ సిబ్బంది కోసం ఇరవై గదులతో భవనాన్ని నిర్మించిందని, అవి ఉపయోగంలో లేవని, ఆ భవనాన్ని లీజుకు ఇచ్చేందుకు అనుమతులు ఇవ్వాలని ఎంపీ కోరారు.

ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

పొన్నూరుటౌన్, జూలై 26: ఈ నెల 31వ తేదీ నుంచి పొన్నూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి డిప్లమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తునట్లు చెప్పారు, 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో జరిగే స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావలసినదిగా సూచించారు.

శక్తివంతమైన భారత్ కోసం కార్గిల్ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

గుంటూరు ఎమ్మెల్యేల పిలుపు





కార్గిల్ ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి, సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, హాజరైన కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్‌లు

గుంటూరు సిటీ, జూలై 26: 2047 నాటికి దేశాన్ని గొప్ప శక్తివంతమైన దేశంగా మార్చేందుకు, కార్గిల్ యుద్ధంలో సాధించిన చిరస్మరణీయ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని గుంటూరు ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన మూడు రోజుల కార్గిల్ విజయ్‌దివస్ రజతోత్సవ ఫొటో ఎగ్జిబిషన్‌లో సమావేశమైన కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్‌లను ఉద్దేశించి వారు ప్రసంగించారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఏర్పాటుచేసిన ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన తర్వాత గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ 2047 నాటికి అభివృద్ధి పరంగా భారత్‌ను ప్రపంచంలో అగ్రస్థానానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకోవాలని కోరారు. యువత చిత్తశుద్ధితో కృషి చేస్తేనే ఉజ్వల లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. దేశం శాంతియుతంగా ఉండేందుకు సైనికులు ఎన్నో త్యాగాలు చేశారని ఆమె అన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు జీవిత పరీక్షల్లో విజయం సాధించేందుకు సన్నద్ధతను కొనసాగించాలన్నారు. చారిత్రక సంఘటనలు భవిష్యత్తు తరాలకు కొన్ని పాఠాలను మిగులుస్తాయన్నారు. విజయంలో క్రమశిక్షణ, సంసిద్ధత కీలకమని చెప్పారు. ఎమ్మెల్యేలు ఇద్దరూ ఎగ్జిబిషన్‌లో కార్గిల్ యుద్ధానికి సంబంధించిన వివిధ చిత్రాల వివరాలను తెలుసుకున్నారు. ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్ 1999లో అధిక ఎత్తులో జరిగిన కార్గిల్‌యుద్ధంలో సైన్యం ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించారు. భారతదేశం తన ఆయుధాలను, యుద్ధ వ్యూహాలను ఆధునీకరించి తిరుగులేని శక్తిగా ఎదిగిందన్నారు.

పీఐబీ, సీబీసీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజిందర్‌చౌదరి సరైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడానికి సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చేపట్టిన వివిధ కార్యకలాపాలను వివరించారు. సవాళ్లను ఆత్మవిశ్వాసంతో స్వీకరించి, ఫలితాలను వినయంతో స్వీకరించాలని విద్యార్థులను చైతన్యపరిచారు. దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించడంలో సైనికులు చేసిన అత్యున్నత త్యాగాలను స్మరించుకునేందుకు సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సీబీసీ, అందరికీ అందుబాటులో ఉండేలా మూడు రోజుల ఫొటో ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వివిధ కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు దేశభక్తి నినాదాలతో ర్యాలీకి నాయకత్వం వహించగా, సీబీసీ ఫీల్డ్ ఆఫీసర్ ఆర్ రమేష్‌చంద్ర, ఎన్‌సీసీ అధికారి విజయ్ మోహితే జెండా ఊపి ప్రారంభించారు. సీబీసీ వివిధ కళాశాలల్లో కార్గిల్ విజయదివస్ సిల్వర్ జూబ్లీ థీమ్‌పై వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, డ్రాయింగ్ పోటీలను కూడా నిర్వహించింది.

దేవదాయశాఖ భూముల్లో నివాసముంటున్న పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

● పెదకాకాని మండలంలో ఎన్టీఆర్, ఏవీఎన్ కాలనీలో సుదీర్ఘకాలంగా నివాసం ఉంటున్న పేదలు

● అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల



అసెంబ్లీ సమావేశాల్లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పెదకాకాని, జూలై 26: దేవదాయశాఖ భూముల్లో నివాసముంటున్న పేదలకు ఇళ్లస్థలాలు మంజూరుచేయాలని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని పెదకాకాని మండలంలో ఎన్టీఆర్, ఏవీఎన్ కాలనీలో ఉన్నాయని తెలిపారు. ఎన్టీఆర్ కాలనీ పెదకాకానిలోని శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంకు చెందిన భూమిని, ఏవీఎన్ కాలనీ ప్రకాశం జిల్లాలోని అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంకు చెందిన భూమి ఉందని తెలిపారు. ఈ రెండు కాలనీలు దేవదాయశాఖకు చెందినవి అని, అందులో సుమారు 30, 40 సంవత్సరాలు నుండి పేదలు ఇళ్ల నిర్మాణం చేపట్టి నివాసం ఉంటున్నారు. పేదలకు తగు న్యాయం చేయాలని కోరారు. ఆ రెండు కాలనీలలో గ్రామపంచాయతీ తరపున వీధిలైట్లు, తాగునీరు, డ్రైనేజీ, అంగన్‌వాడీ కేంద్రాల వంటి అనేక మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. ప్రస్తుతం ఆ కాలనీలను తొలగించడం సాధ్యం కాదని, వారికి న్యాయం చేయాలన్నారు. ఆయా కాలనీలలో నివాసం ఉంటున్న పేదలకు ఒక రేటు నిర్ణయించి, వారికే ఇళ్లస్థలాలు మంజూరుచేయాలని కోరారు. ఆ దిశగా రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక జీవోని తీసుకొచ్చి రెవెన్యూలో నిషేధిత భూములను, పొలాలను పెద్దఎత్తున కాజేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో పేదలకు ఏమాత్రం న్యాయం జరగలేదని, ప్రభుత్వ పెద్దలు గద్దల్లాగా దోచుకున్నారన్నారు.

డేటా ప్రాసెసింగ్‌పై విస్తృత పరిశోధనలు అవసరం

● వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, జూలై 26: మన దేశం డేటా ప్రాసెసింగ్‌పై చేస్తున్న విస్తృత పరిశోధనలు మరింత వేగవంతం కావాలని ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కే గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆనాల్గమేషన్ ఆఫ్ నావిగేషన్ ఎర్త్ అబ్జర్వేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీస్ అనే అంశంపై సాంకేతిక సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా వీసీ ప్రొఫెసర్ గంగాధరరావు మాట్లాడారు. ప్రపంచం మొత్తం డేటా ప్రాసెసింగ్‌పై పరిశోధనలు చేస్తున్నాయని, మన దేశం టెక్స్‌టైల్, మ్యానుఫ్యాక్చరింగ్, ఎస్వీపీ, జీపీయూ ప్రాసెసర్, మ్యానుఫ్యాక్చరింగ్ మీద దృష్టి సారించిందని అన్నారు. గణితశాస్త్ర నైపుణ్యం అందరూ పెంచుకోవాలని సూచించారు. సెమినార్ డైరెక్టర్ ఆచార్య పి.సిద్దయ్య మాట్లాడుతూ సాంకేతికతలను మెరుగుపరిచి సమ్మేళనం చేయడం ద్వారా ఒక ఆచరణార్థమైన వ్యవస్థ సామర్థ్యం పెరుగుతుందన్నారు. బి.ఈ.ఎల్ జనరల్ మేనేజర్ డాక్టర్ సీహెచ్ విశ్వనాథన్ మాట్లాడుతూ పరిశ్రమలు ఆశిస్తున్న నైపుణ్యం విద్యార్థులు పొందాలంటే హార్డ్‌వేర్ టెక్నాలజీలో వస్తున్న మార్పులపై దృష్టి సారించాలన్నారు. వీఎస్‌ఎల్ ఐ కోర్ టెక్నాలజీపై సాధన చేసి మెలకువలు పెంచుకోవాలని సూచించారు. బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కొరకు బీఈఎల్‌లో అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఎఫ్‌ట్రానిక్స్ అధిపతి డి. రామకృష్ణ మాట్లాడుతూ డిజిటల్ అల్గారిథం డెవలప్‌మెంట్, గణిత శాస్త్ర ప్రావీణ్యం భవిష్యత్తును అంచనా వేయగల స్మార్ట్ సిస్టమ్స్ మీద అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎఫ్‌ట్రానిక్స్ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ కల్పిస్తామని సూచించారు. గౌరవ అతిథి ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ ఈ. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వివిధ దేశాల శాటిలైట్ సిస్టం, రిసెప్షన్ డేటా ఎనాలిసిస్ చేసే సాంకేతికతలను పుస్తకపఠనం మీద మాత్రమే ఆధారపడకుండా పోటీపడి నేర్చుకోవాలన్నారు. పి.రాఘవేంద్రరావు అడ్వాన్స్ నావిగేషన్ గైడ్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్ ఫర్ మిస్సైల్స్ స్పెక్ట్రమ్ అనే అంశంపై ప్రసంగించారు. ఈ సదస్సుకు వివిధ కళాశాల నుంచి 300మంది హాజరయ్యారు. సదస్సులో ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఓఎస్‌డీ ప్రొఫెసర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీలి మీడియా ద్వారా ప్రజాధనాన్ని దోచుకున్న జగన్

● సభా సంఘం ద్వారా విచారణ జరిపించాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆనందబాబు



అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జూలై 26: రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసం చేయడంతో పాటు ప్రజాస్వామ్య విలువలను మంటగలిపి జగన్ ముఖ్యమంత్రిగా ఉండి ఐదేళ్ల కాలంలో నీలి మీడియా ద్వారా ప్రజాధనాన్ని దోచుకున్నారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీలో ఆయన గళం విప్పారు. అడ్డగోలుగా నీలి మీడియాకు ప్రజధనాన్ని దోచిపెట్టి దుర్వినియోగం చేశారన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా అనేది ఫోర్త్ ఎస్టేట్. మన రాష్ట్రంలో అలా కాకుండా జగన్ కోసం మీడియా లాగా వ్యవహరించారన్నారు. రాజశేఖరరెడ్డి అధికారంలో ఉండగా దానిని అడ్డం పెట్టుకుని క్విడ్ ప్రోకో ద్వారా వేల కోట్లు సంపాదించిన జగన్ ఒక్క రూపాయి పెట్టుబడి లేకుం డా రూ.1250 కోట్లతో అదే మీడియా సామ్రాజ్యాన్ని ఏర్పాటుచేసుకున్నాడని, అదే సాక్షి మీడియా అన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత అదే క్విడ్ ప్రోకోను కొనసాగిస్తూ అదే సాక్షిని అడ్డాగా మార్చుకుని బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చుకున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రకటన ద్వారా తెలియజేసే సందర్భంలో గత ప్రభుత్వాలను విమర్శిస్తూ ప్రకటనలు ఇచ్చేవారని, ప్రభుత్వం వారు ఇచ్చిన వివరాల ప్రకారం గత ఐదేళ్లలో వార్తా పత్రికలకు ఇచ్చిన ప్రకటనల ఖర్చు రూ.850కోట్ల పైచిలుకు కాగా అందులో సాక్షి మీడియాకు 300 కోట్లు పైగానే ఖర్చు చేసినట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. సర్క్యులేషన్ లేని ఇంగ్లీష్ పేపర్లకు ప్రకటనలు ఇచ్చి ఆ పేపర్ల ద్వారా జగన్‌కు అనుకూలంగా సర్వేలు ఇప్పించుకున్నాడని చెప్పారు. డిజిటల్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి రూ.120కోట్లు ఆ కార్పొరేషనుకు అప్పజెప్పారన్నారు. ఐడ్రీమ్ యూట్యూబ్ ఛానల్‌లో పనిచేసే వాసుదేవరెడ్డిని డిజిటల్ కార్పొరేషన్ ఎండీగా కూర్చోబెట్టి వాళ్లకు దోచిపెట్టి సాక్షి మీడియాలో పనిచేసే సిబ్బందికి కూడా ప్రభుత్వ సొమ్మునే జీతాలుగా చెల్లించారన్నారు. వీటన్నింటిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని, దీనిపై సభా సంఘాన్ని నియమించి ఐదేళ్ల కాలంలో జరిగిన దుర్వినియోగం వెలికి తీయాల్సిందిగా అసెంబ్లీ సాక్షిగా ఆధారాలు చూపుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఎర్రకుంటపై మరలా కబ్జాదారుల కన్ను

● విలువైన భూమి స్వాహాకు యత్నం ● నోట్ల మత్తులో రెవెన్యూ అధికారులు



ఎర్రకుంట భూమిని పూడ్చడానికి తోలిన మట్టి కుప్పలు, గతంలో ఎర్రకుంటను మట్టితో పూడ్చి కబ్జా చేసిన కొంత భూమి

కారంపూడి, జూలై 26: కారంపూడి-వినుకొండ రహదారిలో నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకు పక్కన దశాబ్దాల కాలంగా ఎర్రకుంట భూమి ఉంది. ఈ కుంటలో పశువులు, మేకలు, ఆవులు దాహార్తిని తీర్చుకుంటాయి. వేసవి కాలంలో సైతం ఈ కుంట నీరు అన్ని జీవాలకు తాగునీటిని అందిస్తుంది. కారంపూడిలోని సర్వే నం.772/3లో 4.82 ఎకరాల కుంట భూమి ఉంది. ఈ భూమిపై గత జనవరిలో అప్పటి అధికారపార్టీ వైసీపీ నేతల కన్ను పడింది. కొద్దికొద్దిగా పూడ్చుకుంటూ మట్టితోలి చదును చేశారు. అప్పుడు పత్రికలన్నీ ఈ కబ్జాను వెలుగులోకి తేవడంతో తప్పని పరిస్థితుల్లో రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ భూమి అంటూ బోర్డు పెట్టారు. మరలా దీనిపై కబ్జాదారుల కన్ను పడింది. బోర్డును పీకిపారేసి కుంటను పూడ్చడానికి మట్టిని తోలిస్తున్నారు. రహదారి పక్కనే ఉన్న ఈ భూమికి మంచి గిరాకీ ఉంది. దీనిని కబ్జా చేసి సొంతం చేసుకోవాలనే ఆశ కబ్జాదారుల్లో మొదలైంది. దీనిలో కొంత భాగాన్ని సరిహద్దు పొలాల వారు కలిపేసుకున్నారు. ఈ ప్రాంతంలోనే పెట్రోల్ బంకు ఏర్పాటవడంతో భూమికి ధర పెరిగింది. రెవెన్యూ శాఖ దీనిపై మరలా దృష్టి సారించి కొలతలు వేసి భూమి చుట్టూ పెన్సింగ్ వేసి కుంటభూమి మనుగడను కాపాడి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుద్యోగ భృతికి వయోపరిమితి 45 సంవత్సరాలకు పెంచాలి

● ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు



మాట్లాడుతున్న పరుచూరి రాజేంద్రబాబు, పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు

గుంటూరు(తూర్పు), జూలై 26: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి ఎటువంటి ఆంక్షలు లేకుండా రూ.3వేలు ఇవ్వాలని, కనీస వయోపరిమితి 35 నుంచి 45 సంవత్సరాలకు పెంచాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు అన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం గుంటూరు, మల్లయ్య లింగంభవన్‌లో జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజేంద్రబాబు మాట్లాడుతూ యువనేస్తం పథకం కుటుంబంలో ఎవరికైనా పెన్షన్ వస్తే ఇవ్వమని, కనీస ఆదాయం రూ.10వేలకు మించి ఉండకూడదని, గ్రామీణ ప్రాంతాల్లో ఐదు ఎకరాల కంటే సాగు భూమి ఉండకూడదని, పట్టణ ప్రాంతాలలో 1500 చదరపు అడుగుల నివాస స్థలం ఉండకూడదనే షరతులను పెట్టడం సరికాదన్నారు. డీఎస్సీని పాత పద్ధతిలోనే నిర్వహించాలన్నారు. నూతన విధానం ఆన్‌లైన్లో నిర్వహించడం వలన అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, పరీక్షను ఆఫ్‌లైన్‌లోనే నిర్వహించాలన్నారు. సమావేశంలో నాయకులు షేక్ వలి, చల్లా మరిదాసు, జాలాది, నవీన్ బిల్లా రాజేష్, నాసర్‌జీ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా - గుంటూరు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రక్రియ ప్రారంభం

● ఓటర్ల జాబితాల రూపకల్పనకు షెడ్యూల్ విడుదల ● వచ్చే ఏడాది మార్చి 29వ తేదీతో ముగియనున్న పదవీకాలం

గుంటూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ప్రక్రియ ప్రారంభమైంది. జాతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వచ్చే ఏడాది మార్చిలో జరగబోయే ఈ ఎన్నిక కోసం తాజా ఓటర్ జాబితాలను సిద్ధం చేయాల్సి ఉంది. ఆ మేరకు చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్ యాదవ్ శుక్రవారం ఓటర్ జాబితాల రూపకల్పనకు షెడ్యూల్‌ని ప్రకటించారు. ఈ ఏడాది నవంబరు 1వ తేదీ నాటికి ఎవరైతే పట్టభద్రులు ఉంటారో వారు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ నమోదు చేయడం అనేది ఓటరు ఇష్టం.

- సెప్టెంబరు 30వ తేదీన ఓటర్ జాబితాల రూపకల్పనకు నోటిఫికేషన్‌ని విడుదల చేస్తారు.
- అక్టోబరు 16న మరోసారి రీపబ్లికేషన్ చేస్తారు.
- అక్టోబరు 25న రెండో రీపబ్లికేషన్ చేస్తారు.
- నవంబరు 6వ తేదీ వరకు ఫారం-18, 19లో దరఖాస్తులు స్వీకరిస్తారు.
- నవంబరు 20వ తేదీ లోపు ముసాయిదా ఓటర్ల జాబితాలను ముద్రిస్తారు.
- నవంబరు 23వ తేదీన ముసాయిదా ఓటర్ జాబితాలు ప్రకటిస్తారు.
- నవంబరు 23 నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేసేందుకు అవకాశం కల్పిస్తారు.
- డిసెంబరు 25వ తేదీన క్లెయిమ్‌లు, అభ్యంతరాలు పరిష్కరించి సప్లిమెంట్ ఓటర్ జాబితాలను ముద్రిస్తారు.
- డిసెంబరు 30వ తేదీన తుది ఓటర్ల జాబితాని ప్రచురిస్తారు.

తల్లీబిడ్డలను కలిపిన 'ఆధార్'

● చిన్నతనంలో తప్పిపోయిన మానసిక దివ్యాంగులు

● పదేళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు..



ఆశ్రమంలో తల్లిదండ్రులతో కోటప్పకొండ గ్రామానికి చెందిన రాజు, ఇమాన్యుయేల్

శివ్వంపేట, జూలై 26: ఆ ముగ్గురి మానసిక స్థితి సరిగ్గా లేదు. ఇందులో ఇద్దరు సోదరులు 12 క్రితం, మరొకరు 9 ఏళ్ల క్రితం తప్పిపోయారు. ముగ్గురూ మెదక్ జిల్లా శివ్వంపేట మండలం మగ్దుంపూర్ గ్రామం లోని సజీవ ర్లీస్ నెలకొల్పిన బేతాని సంరక్షణ అనాధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్నారు. వారికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయించేందుకు ఆశ్రమ నిర్వాహకులు తీసుకెళ్లగా.. వారు అనాథలు కారు. వారికోసం అప్పటినుంచి కుటుంబసభ్యులు వెతుకుతూనే ఉన్నారని తేలింది. తమ బిడ్డలు క్షేమంగా ఉన్నారని తెలుసుకుని వారు ఆనందపడి తమ పిల్లలను తీసుకెళ్లా రు. వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా నరసరావుపేట మండలం కోటప్పకొండ గ్రామానికి చెందిన దాసరి నాగేంద్ర, శీను దంపతులు ఎల్బీనగర్‌లో ఉంటూ వెంట్రుకల వ్యాపారం చేస్తుంటారు. వారికి ఇద్దరు మానసిక దివ్యాంగులైన కుమారులు రాజు (13), ఇమ్మానియేల్(9) ఉన్నారు. 12 ఏళ్ల క్రితం రాజు మారం చేస్తుండటంతో తల్లి డబ్బులు ఇచ్చి కిరాణా షాపులో కొనుక్కోమని పంపించింది. అప్పుడు తప్పిపోయిన రాజు, ఇమ్మానియేల్ అటుఇటు తిరిగి బేతాని సంరక్షణ ఆశ్రమానికి చేరారు. అప్పటినుంచి అక్కడే ఉంటున్నారు. మానసిక దివ్యాంగుల పథకం పొందేందుకు ఆశ్రమ నిర్వాహకులు వారి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయించాలని ప్రయత్నించారు. అయితే, ఆధార్ రిజక్ట్ అయింది. ఆరా తీయగా, వారిపేరిట ఎక్కడో ఆధార్ నమోదైఉన్నట్లు తేలింది. వీరి ఆచూకీ కోసం ప్రయత్నించగా, తల్లిదండ్రుల చిరు నామా దొరికింది. వారికి సమాచారం ఇవ్వగా వారు శుక్రవారం ఆశ్రమా నికి వచ్చి తమ బిడ్డలను అక్కున చేర్చుకున్నారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ వీరబాబు, ఆశ్రమం క్యాంప్ ఇన్‌చార్జి విన్సెంట్, సిస్టర్ కార్మాల్ ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

రూ.3.36 లక్షల పురుగుమందుల అమ్మకాలు నిలిపివేత

గుంటూరు సిటీ, జూలై 26: గుంటూరులోని ఏటుకూరు రోడ్డులో ఉన్న పురుగుమందుల గిడ్డంగుల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ తనిఖీలలో ఆగ్రో సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి చెందిన కూల్‌స్టార్ అనే పురుగుమందులను స్టాక్ బోర్డునందు, స్టాక్ రిజిస్టర్ నందు వివరాలు సరిగా నమోదు చేయకుండా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. వ్యవసాయశాఖ అనుమతులు లేకుండా ఈ పురుగుమందులను అమ్ముచున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. రూ.3,36,300 విలువైన 100 లీటర్ల పురుగుమందు అమ్మకాలు నిలిపివేస్తూ ఆదేశాలు జారీచేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయ అధికారి ఖడ్గం రమణకుమార్, స్థానిక వ్యవసాయ అధికారి బీ గౌతంప్రసన్న పాల్గొన్నారు.



ఏటుకూరు రోడ్డులోని పురుగుమందుల గిడ్డంగుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పెదకాకానిలో యువకుడు ఆత్మహత్య

పెదకాకాని, జూలై 26: పెదకాకానిలోని వడ్డెరకాలనీలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... వడ్డెరకాలనీకి చెందిన వేముల చిట్టిబాబు(24) ట్రాక్టర్ డ్రైవర్. ఇతనికి భార్య, ఏడాది వయసుగల కుమారుడు ఉన్నాడు. ఇటీవల స్థానిక యువతితో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న చిట్టిబాబు భార్య ఆ మహిళతో ఘర్షణ పడింది. ఇరువురు కొట్టుకున్నారు. ఈ వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. దీంతో చిట్టిబాబు భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని చిట్టిబాబు చనిపోయాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. వివాహేతర సంబంధమే మృతుడి ఆత్మహత్యకు కారణం అని పోలీసులు భావిస్తున్నారు.

29,453 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 26,896 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 29,453 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 11,210 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8500	15500	334	8500	14500
నెంబరు.5	9000	12200	నెంబరు. 5	10000	16000
273	11000	11600	273	12000	12000
341	8500	13500	341	8500	13500
4884	--	--	4884	11800	16000
సూపర్ 10	15000	15000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18500	తేజ	8500	18000
బ్యాడిగి	8000	15000	బ్యాడిగి	9000	13000
దేవనూరుడీలక్స్	8500	11000	దేవనూరుడీలక్స్	9000	13000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



శ్మశాన స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన వీఏవోలు

భూ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు

- మండల డిప్యూటీ తహసీల్దార్ కీర్తిసుధా స్రవంతి
- శ్మశాన భూమిలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

కారంపూడి, జూలై 26: ప్రభుత్వ భూమి ఆక్రమణలకు పాల్పడితే సహించేది లేదని కారంపూడి మండల డిప్యూటీ తహసీల్దార్ కీర్తిసుధా స్రవంతి హెచ్చరించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'మరుభూమినీ మింగేశారు' అన్న కథనంపై శుక్రవారం ఆమె స్పందించారు. మండలంలోని ఒప్పిచర్లలో 614 బైబీలో సుమారు 75 సెంట్ల భూమిని ప్రభుత్వం శ్మశాన వాటికకు కేటాయించింది. ఈ భూమిని అక్రమార్కులు ఆక్రమించుకొని చదును చేశారు. దీనిపై గ్రామస్థులు సైతం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆంధ్రజ్యోతి కథనంతో స్పందించిన రెవెన్యూ అధికారులు సదరు భూమిని పరిశీలించి గ్రామ వీఏవోల ద్వారా శ్మశాన వాటిక భూమిలో 'ఈ భూమి ప్రభుత్వ భూమి, ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

మాచవరం, జూలై26: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, ప్రతి ఒక్కరు అప్రమత్తంగా వుండాలని ఎంఎల్‌హెచ్‌పీ హనుమంతరావు గ్రామస్థులకు సూచించారు. శుక్రవారం మండలంలోని వేమవరం గ్రామంలో జలజీవన్ మిషన్, పారిశుధ్యం కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమంతరావు మాట్లాడుతూ ప్రజలు వారి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని, వీధుల వెంట మురుగునీరు నిల్వవుండకుండా సైడు కాల్వల్లో నీరు పారేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివప్రసాద్ మాట్లాడుతూ త్వరలో ఇంటింటికి జలజీవన్ మిషన్ పథకం కింద మంచినీటి కుళాయి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో సర్పంచ్ దొండేటి కృష్ణారెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పంపనీడి పుల్లయ్య, వైసీపీ నాయకులు పెరుగు రోశయ్య, పంచాయతీ కార్యదర్శి సురేఖ, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

మాచవరం, జూలై 26: రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు రైతులకు సూచించారు. శుక్రవారం మాచవరం మండలంలోని వేమవరంలో విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వరిలో ఆవుపేడ, పుట్టమట్టి, ఆవు పంచకం, సున్నంతో విత్తనశుద్ధి చేసినట్లైతే చీడపీడల నుంచి రక్షించుకోవచ్చునని వివరించారు. విత్తనశుద్ధి ఎలా చేసుకోవాలో రైతులకు సూచించారు. అనంతరం పత్తిపంట క్షేత్రాన్ని సందర్శించి చీడపీడల నివారణకు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి రామమ్మ, ప్రకృతి వ్యవసాయం మండల కో-ఆర్డినేటర్ సునీల్, కొలగాని శివ, పెరుగు రోశయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు వంశీ, రైతులు పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

రెంటచింతల,జూలై 26 :చాలీచాలని గదులతో చెట్ల నీడన,రేకుల షెడ్డులో చదువుకుంటూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని మండల స్పెషలాఫీసర్ సత్యనారాయణ శర్మ అన్నారు. శుక్రవారం మండలంలోని రెంటాల జడ్పీ హైస్కూలును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చాలీచాలని ఇరుకు తరగతి గదులతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. సమస్యలన్నింటిని కలెక్టర్‌కు నివేదిస్తానన్నారు. అనంతరం పాఠశాలకు సమీపంలోని దేవాదాయ భూమిని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకరరావు, కార్యదర్శి కోటేశ్వరరావు, హెచ్‌ఎం నాగవీరయ్య, బిచ్చిరెడ్డి, లింగారెడ్డి, చంద్రశేఖర శర్మ, సాగర్‌బాబు, మల్లికార్జున,రామాచారి తదితరులు పాల్గొన్నారు.

పంట సాగు హక్కు పత్రాలను పొందండి

అచ్చంపేట, జూలై 26 : ప్రతి కౌలుదారుడు పంట సాగు హక్కు పత్రాలను పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ అన్నారు. శుక్రవారం మండలంలోని కొండూరు గ్రామంలో కౌలు రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మురళీ మాట్లాడుతూ భూ యజమానుల హక్కులకు భంగం కలగకుండా పంట సాగు దారు పత్రాలు 11నెలల కాల పరిమితితో రైతులందరికీ జారీ చేయనున్నట్లు తెపాఆరు. కౌలుకు సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా పంట సాగు హక్కు పత్రాలు పొందాలన్నారు. దీనికి గాను భూయజమాని ఆధార్ కార్డు, సాగు దారు ఆధార్ కార్డు, మొబైల్ నెంబరుతో స్థానిక వీఆర్‌వో, గ్రామ వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేయాలన్నారు. కార్డుల ద్వారా పంట నమోదు, కనీస మద్దతు ధర, పంటల బీమా, పంట నష్ట పరిహారం, పెట్టుబడి సాయం వంటి పథకాలు పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా కౌలు రైతులకు హక్కు పత్రాలు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పీ వెంకటేశ్వర్లు, వీఆర్‌వో రాజబాబు, గ్రామ కార్యదర్శి ఉమా మహేశ్వరరావు, ఉద్యానవన సిబ్బంది, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి జాతర

దాచేపల్లి, జూలై 26: దాచేపల్లి గ్రామ మహాలక్ష్మీ అమ్మవారి జాతర సందర్భంగా శుక్రవారం మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమ, గాజులు సమర్పించారు. వారం రోజులుగా దాచేపల్లిలోని బొడ్రాయి సెంటర్‌లో మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలందరూ అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ నెల 28న దాచేపల్లిలో జరిగే జాతరకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.

పిల్లల ఆహార విషయంలో అలసత్వం వద్దు

దుర్గి, జూలై 26: పిల్లల ఆహార విషయంలో అలసత్వం వహించరాదని, నాసిరకం ఆహారం అందిస్తే కఠినచర్యలు తీసుకుంటామని మండల స్పెషలాఫీసర్ సంజీవరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఓబులేశునిపల్లె గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యర్థులకు అందజేసే మధ్యాహ్న భోజన పథకం అమలుని పరిశీలించారు. స్వయంగా భోజనం తిని నాణ్యత, రుచిని పరీక్షించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీవో గుప్త, సిబ్బంది ఉన్నారు.

తాగునీరు కాలుష్య నివారణకు చర్యలు

దాచేపల్లి, జూలై 26: గ్రామాలలో ప్రజలు తాగునీరు కలుషితం కాకుండా శ్రద్ధ చూపాలని ప్రాజెక్టు విస్తరణాధికారి పట్టాభి కోరారు. శుక్రవారం మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో డెంగ్యూ జ్వరాల మాసోత్సవం సందర్భంగా దాచేపల్లి, నడికూడి, ముత్యాలంపాడు క్వారీ గుంతల్లో, చెరువుల్లో దోమల లార్వాను నివారించడానికి గంబూసియా చేపలను వదిలారు. వాటర్ ట్యాంక్‌ల్లో తాగునీరు నిల్వలేకుండా చూడాలని స్థానికులను కోరారు.



తిరుపతికి పాదయాత్రగా బయలుదేరిన టీడీపీ నేతలు

అడిగొప్పుల నుంచి తిరుపతికి పాదయాత్ర

దుర్గి, జూలై 26: మండలంలోని అడిగొప్పుల నుంచి తిరుపతి వరకు 20 మంది టీడీపీ నేతలు శుక్రవారం మహా పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, లింగా రమేష్, యాగంటి నరేష్‌లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి అంజయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, మాచర్ల నియోజకవర్గం నుంచి జూలకంటి బ్రహ్మానందరెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడంతో మొక్కును తీర్చుకునేందుకు పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. పాదయాత్ర చేపట్టిన వారిలో నలబోతు అప్పారావు, కొనకంచి పూర్ణ, వడ్లపల్లి శ్రీను, దొండపాటి బ్రహ్మయ్య, కావూరి శివ, ఐనాల గురవయ్య, కోటయ్య, ఉన్నం నరేంద్ర, కొంగర రామకోటేశ్వరరావు, నలబోతు హరీష్, తుర్లపాటి శివ, మందలపు తేజ, టీ.మల్లికార్జునరావు, యడ్లపల్లి సంతోష్, పువ్వాడ రామలింగం, కొనకంచి మహేష్ తదితరులు ఉన్నారు.

పంట సాగుదారు హక్కు పత్రం తప్పనిసరి

- బీమా, సబ్సిడీ, రుణాలు పొందేందుకు అవకాశం
- పంపిణీకి సిద్ధంగా పచ్చి రొట్ట విత్తనాలు
- జిల్లా వ్యవసాయ అధికారి మురళీ వెల్లడి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళీ

క్రోసూరు, జూలై 26 : కౌలు రైతులు రెవెన్యూ శాఖ నుంచి పంట సాగుదారు హక్కు పత్రాన్ని తప్పనిసరిగా పొందితేనే ప్రభుత్వ ప్రయోజనాలు పొందటానికి అర్హులవుతారని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ తెలిపారు. శుక్రవారం మండలంలోని దొడ్లేరు గ్రామంలో సాగుదారు హక్కు పత్రాలపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతులకు హక్కు పత్రం ఉంటే ఈ పంట నమోదు చేయవచ్చునని పంటకు నష్టం జరిగినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ పొందవచ్చునని, పండించిన పంటకు బీమా పథకం, కనీస మద్దతు ధర, బ్యాంక్ రుణం పొందేందుకు వీలుంటుందని తెలిపారు. కౌలు రైతులు పొలం యజమాని పట్టా దారు పాసు పుస్తకం, యజమాని ఆధార్ కార్డు జిరాక్స్, కౌలు రైతు ఆధార్ కార్డు జిరాక్స్, కౌలు రైతు బ్యాంక్ పాసు పుస్తకం, కౌలు రైతు పాసు ఫోర్డు రెండు దరఖాస్తుకు జత చేసి రెవెన్యూ అధికారుల వద్దకు వెళితే హక్కుపత్రం పొందవచ్చన్నారు. వ్యవసాయశాఖ ద్వారా సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. భూసార పరీక్షల కోసం గ్రామాల్లో మట్టి నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపుతున్నట్లు తెలిపారు. రైతులు మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడితే దుష్ఫలితాలు సంభవిస్తాయ న్నారు. సేంద్రీయ వ్యవసాయంపై మొగ్గుచూపాలని, నేల ఆరోగ్యాన్ని కాపాడు కోవాలన్నారు. పీఎం కిసాన్ పథకం ద్వారా అర్హత ఉండి సొమ్ము జమ కాని రైతులు సంబంధిత పత్రాలతో వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన రసాయానిక ఎరువులు అందుబాటులో ఉంచుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్, రైతు సేవా కేంద్రం సిబ్బంది కమల, దివ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన
ఎన్‌ఏసీహెచ్‌ఆర్‌ఐ బృందం

కారంపూడి, జూలై 26: మండల కేంద్రమైన కారంపూడిలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను శుక్రవారం యాంటీ క్రైం హ్యూమన్ రైట్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఏసీహెచ్‌ఆర్‌ఐ) సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ కిట్స్ సక్రమంగా అందాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గది, వసతి గది ఒకటే ఉండడం, ఒక్కో గదిలో 25 మంది విద్యార్థులు ఇరుకుగా విద్యను అభ్యసించడంపై ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌ను వివరణ కోరారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాలుర నూతన వసతిగృహం రూ. 6 కోట్లతో నిర్మించారని, ప్రహరీ, పాఠశాలకు రోడ్డు నిర్మాణం, అన్ని వసతులతో వసతి గృహం నిర్మాణం పూర్తయితే అక్కడకు మార్చనున్నట్లు తెలిపారు. కాగా సబ్బులు, నూనెలు, షాపులు, హెయిర్ కటింగ్ నిధులు రెండేళ్లుగా అందించడం లేదని విద్యార్థులు వారితో తెలిపారు. పాఠశాలలో పీజీటీ ఉపాధ్యాయులు, డేటా ఎంట్రీ ఆపరేటర్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. అనంతరం కమిటి సభ్యులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కాఆర్యక్రమంలో ఎన్‌ఏసీహెచ్‌ఆర్‌ఐ జిల్లా అధ్యక్షుడు గరికపాటి శంకరరావు, ఉపాధ్యక్షుడు చీదెళ్ల మల్లికార్జునరావు, జాయింట్ సెక్రటరీ కాకుమాను శ్రీనివాసరావు, కోశాధికారి కోట బాబురావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాలా వరప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎన్‌ఏసీహెచ్‌ఆర్‌ఐ సభ్యులు

వీర సైనికులకు ఘన నివాళులు

రెంటచింతల,జూలై 26: సుబ్బన్నతోట ఎంపీయూపీ స్కూల్లో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన సైనికుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ చిన్నమ్మ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో 527 మంది సైనికులు అమరులయ్యారని, వారి త్యాగం వృధా కాదన్నారు. కార్యక్రమంలో మారుతి శర్మ, నాగేశ్వరరావు, పుల్లారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేషన్ సెంటర్ ఏర్పాటు

రెంటచింతల,జూలై 26: మేజర్ పంచాయతీ రెంటచింతల పరిధిలోని 1 సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ నమోదు, మార్పులు చేర్పులు వంటివి అవస రమైన వారు ఈ ఆధార్ కేంద్రాన్ని సంప్రదించ వచ్చని తెలిపారు.

మోడల్ స్కూల్ రహదారికి మరమ్మతులు

కారంపూడి, జూలై 26: మండల కేంద్రమైన కారంపూడిలోని ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలల మధ్య రహదారి మరమ్మతు పనులకు టీడీపీ నేతలు శ్రీకారం చుట్టారు. గుంతలమయమైన ఆ రహదారిలో పాఠశాలలకు వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు శుక్రవారం ఆ గుంతలను పూడ్చేందుకు మట్టిని తోలించి చదును చేయించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్ జానీ, మండల మాజీ అధ్యక్షుడు చప్పిడి రాము, ఉపాధ్యక్షుడు నాగవరపు రాముడు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దహనం

సత్తెనపల్లి, జూలై 26: పట్టణంలోని 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాదుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. ఇంటి బయట మంటలు చెలరేగటంతో అచ్యుత శివ ప్రసాదు వెంటనే బయటకు వచ్చి చూశాడు. అప్పటికే ద్విచక్రవాహనం మంటల్లో కాలిపోతూ ఉంది. ఈ ఘటనపై బాధితుడు అయిన అచ్యుత శివప్రసాదు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పిడుగురాళ్ల, జూలై 26: పిడుగురాళ్ల రోటరీక్లబ్, స్నేహ పిల్లల వైద్యశాల ఆధ్వర్యంలో తుమ్మలచెరువులో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలోని 220 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను డాక్టర్ కృష్ణకాంత్ అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు గుండా అశోక్‌బాబు, నీరుమళ్ల రాజేష్, ఆత్మకూరి గురవయ్య, గర్రె సుబ్రహ్మణ్యం, పసుమర్తి రమేష్, మౌలాసాహెబ్, హెచ్‌ఎం గాయత్రి, ఉపాధ్యాయులు ఫిరోజ్‌భాష పాల్గొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

పిడుగురాళ్ల, జూలై 26: ఎస్‌ఆర్‌ఐ టీడీపీ సహకారంతో డిగ్రీ ఉత్తీర్ణులైన యువతీ యువకులు ఉద్యోగ అవకాశాలకు దరఖాస్తు చేసుకోవాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కార్యాలయ సిబ్బంది శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. డిగ్రీ అర్హతతో విజయవాడ, హైదరాబాద్, బెంగుళూరు ఎయిర్‌పోర్టుల్లో, ఇంటర్ అర్హతతో దుబాయ్‌లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. దరఖాస్తులను సెల్ నెం.7981456199 నెంబరుకు వాట్సప్ ద్వారా పంపవచ్చని తెలియజేసింది.

నేడు మండల పరిషత్ సమావేశం

దాచేపల్లి, జూలై 26: దాచేపల్లి మండల పరిషత్ సమావేశం శనివారం మండల పరిషత్ సమావేశపు హాల్లో జరుగుతుందని ఎంపీడీవో వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాల్సిందిగా కోరారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే..

కారంపూడి, జూలై 26: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని ఈవోపీఆర్డీవో సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని మిరియాల, ఒప్పిచర్ల, కాచవరం గ్రామాల్లో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. నూరు శాతం మరుగుదొడ్లు నిర్మాణం చేసుకోవాలన్నారు. భోజనానికి ముందు, తర్వాత చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. త్వరలోనే జలజీవన్ మిషన్ ద్వారా అన్ని గ్రామాల్లో ఇంటింటికి నీటి సరఫరా జరుగుతుందన్నారు. కాచవరంలో శ్రీసిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాల్లో పారిశుధ్యంను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ గ్రామ సభల్లో సర్పంచ్ బత్తుల ఏడుకొండలు, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు భూతేశ్వరరెడ్డి, వెంకటరమణ, రవీంద్ర, పంచాయతీ సిబ్బంది సాగర్‌బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

మాచర్ల రూరల్, జూలై 26: సమగ్ర శిక్షణ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన శుక్రవారం పట్టణంలోని ఎస్‌కేబీఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సింగంశెట్టి బాలయ్య, అధ్యాపకులు ఎస్.బాలయ్య, జీ.బుల్లయ్య, పీ.శ్రీనివాసరావు, బీ.మల్లికార్జునరావు, సుధాకర్, ఎం.రవీంద్ర ప్రసాద్‌నాయక్, ఎన్ దుర్గాదేవి, కే.రత్నకుమారి, ఎస్.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ

కారంపూడి, జూలై 26: స్థానిక అంబేద్కర్ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం మండల ప్రత్యేక అధికారి జోసఫ్‌కుమార్ తనిఖీ చేశారు. పిల్లలకు, బాలింతలకు ఇచ్చే కిట్లు పంపిణీ, భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గ్లైపోసెట్ విక్రయిస్తే కఠిన చర్యలు

గురజాల టౌన్, జూలై 26: గ్లైపోసెట్ పురుగుమందును ప్రభుత్వం నిషేధించిందని, ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో సంధ్యారాణి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ట్రాన్స్‌పోర్టులు, పత్తి పొలాలను ఆమె సందర్శించి పలుసూచనలు చేశారు. పత్తి పంట 30 రోజులు, 60 రోజుల దశలో సూక్ష్మ పోషకాలైన బోరాన్, మెగ్నీషియం, జింక్‌ను పిచికారి చేయాలన్నారు. కంది, బుడ్డశెనగ, పొగాకు, అపరాలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఏవో వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల కార్యవర్గం ఎన్నిక

రెంటచింతల,జూలై 26: మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్ల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డీ.శ్రీకాంత్, కార్యదర్శిగా ఎం.బ్రహ్మయ్య, కోశాధికారిగా ఎస్‌కే.నసీమ్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ప్రగడ కోటయ్యకు ఘన నివాళులు

పిడుగురాళ్ల, జూలై 26: చేనేత ఉద్యమ పితామహుడు, స్వాతంత్ర సమరయోధుడు ప్రగడ కోటయ్య 109వ జయంతి సందర్భంగా పిడుగురాళ్ల పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘం, పద్మశాలీ ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రగడ కోటయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. చేనేత సామాజికవర్గానికి చెందిన అనేక సమస్యలను పరిష్కరించడంలో రాజ్యసభ సభ్యుడిగా ఎనలేని కృషి చేసిన ప్రగడ కోటయ్య సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో పద్మశాలీ సంక్షేమ సంఘం సభ్యుడు గోలి విశ్వేశ్వరరావు, గుర్రం శ్రీనివాసరావు, సాముల హనుమంతరావు, దామర్ల పట్టాభి, గంజి నరసింహారావు, సూరేపల్లి కోటేశ్వరరావు, తదితరులున్నారు.

మాచవరంలో ప్రబలిన డయేరియా

- వాంతులు, విరోచనాలతో మంచం పట్టిన బాధితులు
- కొందరికి గృహాల్లో, మరికొందరు ఆస్పత్రిలో చికిత్స

మాచవరం, జూలై 26: మండలకేంద్రం మాచవరంలో డయేరియా ప్రబలుతోంది. గత నాలుగు రోజులుగా డయేరియా లక్షణాలతో పలువురు మంచం పట్టగా మరికొందరు వివిధ పట్టణాలలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. మాచవరం గ్రామానికి చెందిన కోట పద్మ గత సోమవారం వాంతులు, విరోచనాలతో మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లింది. వైద్యులు ఆమెకు అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలని సూచించారు. అయితే ఆమె పిడుగురాళ్లలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొంది శుక్రవారం మాచవరం గ్రామానికి చేరుకున్నారు. అయినప్పటికీ ఆమె కోలుకోలేదు. అలాగే తాతా మనుమడు అయిన అత్తులూరి ఏసు, నరసింహారావులు విరోచనాలతో బాధపడుతున్నారు. వారు ఇంటివద్దనే ప్రైవేటు వైద్యులచే చికిత్స పొందుతున్నారు. గంటా వెంకటనర్సమ్మ అనే మహిళ నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. మరో మహిళ షేక్ రంజాన్‌బీ డయేరియా లక్షణాలతో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతుంది. వీరంతా ఈవారంలోనే డయేరియా లక్షణాలతో ఆస్పత్రుల పాలయ్యారు. మాచవరం పీహెచ్‌సీ ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు గ్రామంలో ఇంటింటికి తిరిగి డయేరియా లక్షణా లు కలిగిన వారిని గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్సలు చేస్తున్నామంటూ వైద్యాధికారులు ప్రసాద్, అన్వేష్‌లు తెలిపారు.



డయేరియా లక్షణాలతో బాధపడుతున్న పద్మ, ఏసు, నరసింహారావు



ఎమ్మెల్యేలు చింతమనేని, యార్లగడ్డ, అమరనాథ్‌రెడ్డిని సత్కరిస్తున్న భాష్యం ప్రవీణ్

ఎమ్మెల్యేలకు భాష్యం ప్రవీణ్ ఆత్మీయ విందు

పెదకూరపాడు, జూలై 26 : పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తుళ్ళూరు మండలంలోని పెదపరిమిలోని తన స్వగృహంలో సహచర మిత్రులు, పలువురు ఎమ్మెల్యేలకు శుక్రవారం ఆత్మీయ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు, నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, పలమ నేరు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి, చింతలపూడి ఎమ్మెల్యే సంగా రోషన్ బాబు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, టీడీపీ అధికార ప్రతినిధి జీవీ రెడ్డిలను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందించారు.

సైనికుల త్యాగం అజరామరం

సత్తెనపల్లి, జూలై 26: కార్గిల్ యుద్ధ వీరుల త్యాగం అజరామర మమని, ఆ అమరవీరులను యావత్ భారతదేశం ఎప్పటికీ గుర్తించుకుంటుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం పాకిస్థాన్ ఉగ్రమూకలతో పోరాటం చేసి అశువులు భాసిన కార్గిల్ వీర జవానుల త్యాగం చిరస్మరణీయమన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా భారత్ వీర సైనికుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్గిల్ యుద్ధం దేశం గర్వించ దగ్గ విజయమని కన్నా అన్నారు.

పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్‌లో భాగంగా మాజీ సైనికుల అభినందన సభ జరిగింది. మాజీ సైనికులు సత్యనారాయణరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, భగవంతరావులు కార్గిల్ పోరాటంలో భారత సైనికుల పోరాట పటిమను, బలిదానాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం మాజీ సైనికులను పాఠశాల నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చలువాది చిన సత్యనారాయణ, కట్టా శంకరరావు, రాంబాబు, హరి, రవి కుమార్, ధనలక్ష్మి పాల్గొన్నారు.



నకరికల్లు సమీపానగల వెంచర్‌లో రంగు రాళ్ళ కోసం వెతుకుతున్న ప్రజలు

రంగు రాళ్ళ కోసం వెతుకులాట

నకరికల్లు, జూలై 26 : నకరికల్లు సమీపంలోని ఓ వెంచర్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు రంగురాళ్ల వెతుకులాటలో పడ్డారు. నకరికల్లు నుంచి పిడుగురాళ్ళ వైపు వెళ్ళే మార్గంలో నకరికల్లుకు అతి సమీపాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న రెండు వెంచర్లలో రాళ్ళతో కూడిన కొండ మట్టిని తోలారు. ఈ వెంచర్లలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఖరీదైన రాళ్ళ కోసం వెతుకులాట ప్రారంభించారు. అక్కడ దొరికిన రాళ్ళను పరీక్షించేందుకు ఒక వ్యక్తి ఒక యంత్రాన్ని తీసుకు వచ్చాడు. ఒక్కొక్క రాయిని పరిశీలిచినందుకు రూ.10 చొప్పున వసూలు చేస్తున్నాడు. 12 పాయింట్లు వస్తే రంగు రాయిగా, అంతకు లోపు వస్తే మామూలు రాళ్ళుగా నిర్ధారిస్తున్నట్టు అక్కడ ఉన్న ప్రజలు చెపుతున్నారు. త్రిపురాకొండ వద్ద రెవెన్యూ, పోలీసు అధికారులు బోర్డు ఏర్పాటు చేయటంతో నకరికల్లు సమీపాన గల ఈ వెంచర్లలో ప్రజలు ఖరీదైన రాళ్ళ కోసం వెతుకుతున్నారు.

అటవీ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

- డిప్యూటీ రేంజ్ అధికారి నీలిమా దేవి

నకరికల్లు, జూలై 26 : అటవీ భూములను ఎవరైనా ఆక్రమించే ప్రయత్నం చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోనున్నట్టు అటవీ శాఖ డిప్యూటీ డిప్యూటీ రేజ్ అధికారి పీ.నీలిమాదేవి హెచ్చరికలు జారీచేశారు. శుక్రవారం ఆమె రొంపిచర్ల మండలంలోని చాకలికుంట, నకరికల్లు మండలంలోని శివాపురం తండా, ఉదయనగర్ కాలనీ ప్రాంతాల్లోని అటవీ భూములను పరిశీలించారు. భూములను సంరక్షించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రకటనలకే పరిమితమైన ఆధార్ సేవలు

నకరికల్లు, జూలై 26 : ప్రభుత్వం ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక డ్రైవ్ నకరికల్లు మండలంలో అమలు కాలేదు. నకరికల్లు మండలంలో 14 సచివాలయాలు ఉండగా నకరికల్లు, చేజర్ల సచివాలయాల్లో మాత్రమే ఆధార్‌లో మార్పులు చేర్పులు చేసే అవకాశం ఉంది. ప్రత్యేక డ్రైవ్ నకరికల్లు మాత్రమే అమలైంది. గుండ్లపల్లి, చేజర్ల గ్రామాల్లో ఆధార్ సేవలు ప్రజలకు అందలేదు. ఈవిషయమై ఎంపీడీవో టీ.జయమణిని వివరణ కోరగా సాంకేతిక సమస్యలు తలెత్తటంతో ఆధార్ సేవలు నిలిచిపోయాయని, త్వరలోనే పునరుద్ధరిస్తామని ఆమె తెలిపారు.

పారిశుధ్య పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

అమరావతి, జులై 26: మండల పరిధిలోని పంచాయితీలలో పరిశుభ్రత పారిశుధ్యం, అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలకుండా పర్యవేక్షించేందుకు ముగ్గురు అధికారులను ప్రత్యేకంగా నియమిస్తూ ఎంపీడీవో రాణీ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పర్యవేక్షణకు ఈవోపీఆర్డీ, కేజీఏ శ్రీనివాసన్ (9908960733), డీ.భానువెంకటసిద్ధార్ధ (9014109890), కే.ప్రఫుల్లకుమార్ (9550182217)లు విడతల వారీగా ఉదయం 6గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6గంటల వరకు అందుబాటులో ఉంటారు. పారిశుధ్యం, అంటువ్యాధులకు సంబంధించిన సమాచారాన్ని వారికి తెలియజేయాలని కోరారు.

ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో తనిఖీలు

క్రోసూరు, జూలై 26 : జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళీ ఆధ్వర్యంలో శుక్రవారం క్రోసూరులోని నవత, కళ్యాణి ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో రూ.80వేలు విలువ గల 110 లీటర్ల పికప్ అనే పేరుగల బయోస్టిమ్‌లెంట్ మందులను గుర్తించారు. అనుమతి పత్రాలు చూపే వరకు ఆ మందుల అమ్మకాలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారిని ఆదేశించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌ఫోర్టు యజమానులకు పలు సూచనలు చేశారు. నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రవాణా జరిగితే యజమానులు అట్టి స్టాక్‌ను గుర్తించి వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయనతో పాటు మండల వ్యవసాయ అధికారి వేణగోపాల్ ఉన్నారు.

పూర్వ విద్యార్థి సేవలు మరువలేనివి

పెదకూరపాడు: పెదకూరపాడు జడ్పీ హైస్కూలు పూర్వ విద్యార్థి మురళీ ముకుంద్ సేవలు మరువలేనివని జడ్పీ స్కూల్ హెచ్‌ఎం కాకాణి వెంకట రమణ అన్నారు. పెదకూరపాడు జడ్పీ హైస్కూలు విద్యార్థులకు పూర్వ విద్యార్థి అత్తోట మురళీ ముకుంద్ సహకారంతో నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాయపూడి సాంబశివరావు, ఫిజికల్ డైరెక్టర్ వెంకట నాగరాజు, కాసు నాగభూషణరెడ్డి తదితరులు ఉన్నారు.

పాఠశాలలో డీఎల్‌డీవో రాజగోపాల్ తనిఖీ

అమరావతి, జులై 26: మండల కేంద్రమైన అమరావతి గ్రామంలోని పట్నం మాలపల్లెలోగల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను డీఎల్‌డీవో, మండల ప్రత్యేక అధికారి రాజగోపాల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహణ, పారిశుధ్యం తదితర అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాణీ, ఎంఈవో శివబాబు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, హెచ్‌ఎం వెంకటరావమ్మ, బోధనా సిబ్బంది చంద్రలీల, లక్ష్మీవాణి, కళ్యాణి పాల్గొన్నారు.

శాకాంబరిగా అమ్మవారు

అచ్చంపేట, జూలై 26 : స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆషాడ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సూరె వెంకట సుబ్బారావు, మణికంఠ, అను మోలు శేషగిరిరావు, సూరె రామలింగస్వామి పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

శవాలతో రాజకీయం.. జగన్‌కు అలవాటు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 26: శవాలతో రాజకీయం చేయటం మాజీ సీఎం జగన్మోహరెడ్డికి అలవాటు అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇద్దరు వ్యక్తుల మధ్య తగాదాను రాజకీయ హత్యలుగా చిత్రీకరించి పబ్బం గడుపుకోవాలని చూస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి పల్నాడు గురించి మాట్లాడే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. నాడు తోట చంద్రయ్య, జల్లయ్యలను మీ గూండాలు చేసిన హత్యల గురించి కళ్ళు పెద్దవి చేసుకొని ఆ రోజు మాట్లాడి ఉంటే పల్నాడు గురించి మాట్లాడే అర్హత ఉండేదన్నారు. ఆనాడు వైసీపీ ముసుగులో ఉన్న మీ గూండాలు టీడీపీ నాయకులు బుద్దా వెంకన్న, బోండా ఉమామహేశ్వరరావులపై దాడిచేస్తే, ఖండించకపోగా ఒక రౌడీని మున్సిపల్ ఛైర్మన్ చేశావంటూ విమర్శించారు. శవాల పునాదులపై ఏర్పడిన పార్టీ వైసీపీ కాబట్టి ఎక్కడ శవం కనబడితే అక్కడికి వెళ్ళి రాజకీయం చేయడం జగన్‌కు అలవాటైపోయిందన్నారు. రషీద్ కుటుంబానికి ఆర్థికసాయం చేయని నీది కపట ప్రేమ అని విమర్శించారు. సొంత బాబాయి హత్య జరిగితే ఇంతవరకు ఎందుకు దానిగురించి మాట్లాడటం లేదన్నారు. పిన్నెల్లి పాల్వాయి గేట్ బూత్‌లోకి వెళ్లి ఈవీఎంని ధ్వంసం చేస్తే అక్రమంగా కేసులో ఇరికించారని మాట్లాడానికి సిగ్గుగా అనిపించడం లేదా జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రశ్నించారు. అసత్య ప్రచారాలు చేసినందుకే 11 సీట్లకు పరిమితం చేశారన్న విషయాన్ని గుర్తుంచుకుంటే మంచిదన్నారు.



శుక్లాల ఆపరేషన్‌కు తరలిస్తున్న రోగులతో ఫౌండేషన్ మేనేజర్ జీవీ రమణ

కంటి శుక్లాల ఆపరేషన్‌కు రోగుల తరలింపు

వినుకొండ టౌన్, జూలై 26: వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్థాపించిన శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఈ నెల 14వ తేదీన వినుకొండ పట్టణంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి శుక్లాలు శిబిరంలో శంకర కంటి ఆసుపత్రి వైద్యులు 1873మందికి ఆపరేషన్ అవసరమని నిర్ధారించారు. శుక్లాల ఆపరేషన్ అవసరమైన వారిని విడతల వారీగా శంకర్ హాస్పిటల్‌కి పంపించి కంటి శుక్లాల ఆపరేషన్ చేయిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం వైద్యశాలకు వెళ్లే రోగులను శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ మేనేజర్ జీవీ రమణ శుక్రవారం పరామర్శించారు. అనంతరం వారి యోగక్షేమాలలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళా భక్తులు

మహాలక్ష్మమ్మ అమ్మవారికి ఆషాడమాసం బోనాలు

వినుకొండటౌన్, జూలై 26: పట్టణంలోని ముండ్లమూరు బస్టాండ్ డౌన్‌లోని మహాలక్ష్మమ్మ అమ్మవారికి 13, 14 వార్డులోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆషాడమాసం బోనాలు శుక్రవారం సమర్పించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవస్థానం ఆవరణలో పొంగళ్లు చేసి, మేళ తాళాలతో వార్డులోని పురవీధుల్లో బోనాలతో అమ్మవారి భారీ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పూజలు నిర్వహించి, అభిషేకాలతో మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మహిళా భక్తులు మాధవి, భవాని, బుజ్జి, స్వాతి, గాయత్రి, ఆదిలక్ష్మీ, భూదేవి, భ్రమరా, దుర్గా, లక్ష్మీ, శ్రావణి, అంజమ్మ ,తమ్మిశెట్టి ఈశ్వరమ్మ, పాటు కమిటీ పెద్దలు, సుంకర శ్రీనివాసరావు, ఆడపాల రాములు, సోము, కోటేశ్వరరావు, బత్తుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ రెండో సెమిస్టర్‌లో పీఎన్‌సీ అండ్ కేఆర్ డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, జూలై 26: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రకటించిన రెండో సెమిష్టర్ డిగ్రీ ఫలితాలలో పీఎన్‌సీ అండ్ కేఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ జీ వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. బీఏ సోషల్ వర్క్‌లో కట్టా మల్లేశ్వరి 78శాతం, బీఏ స్పెషల్ ఇంగ్లీష్‌లో కంచి సౌమ్యాంజలి 90శాతం, బీసీఏలో పాలకొల్లు నాగదీపిక 88శాతం, బీకామ్ కంప్యూటర్‌లో గంగవరపు శ్రీలేఖ 96శాతం, బీఎస్సీ కంప్యూటర్‌లో జవ్వాజి వాగ్దేవి రమ్య 85శాతం, బీఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో మల్లెల షైనీగ్రేస్ 87శాతం, బీఎస్సీ న్యూట్రీషన్‌లో చందమ్ ఉదయలక్ష్మి 77శాతం, మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎం.ప్రేమ్‌చంద్, ట్రెజరర్ డాక్టర్ ఎం.అన్నపూర్ణ, జాయింట్ సెక్రటరీ పాలడుగు శ్రీనివాసప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఎంఏఎం గ్రూప్ కళాశాలలో కార్గిల్ విజయ దివస్

నరసరావుపేట టౌన్, జూలై 26: ఎంఏఎం గ్రూప్ కళాశాలలో కార్గిల్ యుద్ధం జరిగి 25సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కార్గిల్ విజయ్ దినస్ పేరుతో వీర మరణం పొందిన జవాన్లకు నివాళి అర్పించే కార్యక్రమం నిర్వహించామని కళాశాల ఛైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు శుక్రవారం తెలిపారు. ముఖ్య అతిథులుగా మాజీ సైనిక అధికారులు పులి శ్రీనివాసరెడ్డి, గౌస్ మొహిద్దీన్, వై జయప్రకాష్‌రెడ్డి, రావెళ్ళ సత్యనారాయణ, టీ వెంకటేశ్వరరావు, సీతారామయ్య, జిగురు ప్రతాప సింహశాస్త్రి, విద్యాభారతి సరస్వతి శిశుమందిర్ స్కూల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త వెంకటరామకృష్ణ, పాల్గొని సందేశాలు ఇచ్చారు. ప్రతి విద్యార్థి కార్గిల్ వీరులను ఆదర్శంగా తీసుకొని దేశరక్షణకై పాటుపడాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రామారావు, లా ప్రిన్సిపాల్ కే వీరబ్రహం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన

రొంపిచర్ల, జూలై 26 : ప్రజల జీవితాల్లో సాంకేతిక పరిజ్ఞానం ఇమిడిపోయిందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవినాయక్ శుక్రవారం తెలిపారు. పాఠశాలలో శిక్ష సప్తాహ కార్యక్రమాలు ఐదోరోజు సందర్భంగా సాంకేతిక పరిజ్ఞానం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులు డిజిటల్ టెక్నాలజీని నేర్చుకోవాలన్నారు. విద్యారంగంలోనే కాక సాధారణ జీవితంలో డిజిటల్ వస్తువులు వినియోగిస్తున్నారని తెలిపారు. క్యాలిక్యులేటర్, పేజర్లు, రైల్వే టిక్కెట్ బుకింగ్, ట్యాబ్ ట్యాప్, స్మార్ట్‌ఫోన్ వంటి వస్తువులు వినియోగిస్తున్నామని తెలిపారు. పరిపాలన రంగంలో కూడా డిజిటల్ విధానాన్ని వినియోగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారపరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకం

రొంపిచర్ల, జూలై 26: మండలంలోని అన్నవరం గ్రామ సమీపంలో అక్రమంగా మట్టిని తవ్వుతున్నారు. గత నాలుగు రోజుల నుంచి ఈ మట్టి తవ్వకాలను చేపడుతున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. గతంలో తవ్విన ప్రదేశంలోనే మరలా తవ్వకాలను చేపడుతున్నారు. రాత్రి, పగలు సమయాల్లో టిప్పర్లు అధిక సంఖ్యలో నరసరావుపేట వైపు మట్టిని తరలిస్తున్నాయి. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటువంటి తవ్వకాలను నిలిపివేయాలని కోరుతున్నారు.

ఎస్ఎస్ఎన్ కళాశాల హాస్టల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే చదలవాడ

విద్యార్థుల తీరుపై ఖండన

నరరావుపేట టౌన్, జూలై 26: ఎస్ఎస్ఎన్ కళాశాల బాయ్స్ హాస్టల్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుక్రవారం సందర్శించారు. హాస్టల్ విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎస్‌సీసీ క్యాడెట్లు రెండు, మూడో సంవత్సర విద్యార్థులు ర్యాగింగ్ చేస్తున్నారని వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన నేపథ్యంలో హాస్టల్‌ను సందర్శించారు. వీడియోలో ఔట్ గోయింగ్ మూడో సంవత్సర విద్యార్థులు ఎన్‌సీసీ క్యాడేట్స్ రెండో సంవత్సరం వారిని కర్రలతో పైశాచికంగా కొట్టడాన్ని ఖండించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ కాలేజీ యాజమాన్యం కూడా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌సీసీ అధికారి, హాస్టల్ వార్డెన్ బీఎస్ఆర్‌కే రాజును సస్పెండ్ చేయాలని కళాశాల యాజమాన్యాన్ని ఎమ్మెల్యే కోరారు. ఎస్ఎస్ఎన్ కళాశాల 73 సంవత్సరాలుగా పల్నాడులో పేరుగాంచిందని కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ అన్నారు. రెండు రోజుల క్రితం వీడియో బయటకు వచ్చిందని, వెంటనే స్పందించి జరిగిన సంఘనను విచారించామన్నారు. జిల్లా జడ్జి, మెజిస్ట్రేట్ హాస్టల్‌కు వచ్చి విచారణ చేశారన్నారు. 36మంది విద్యార్థులను కర్రలతో కొట్టి హించించినట్లు విచారణలో తేలిసిందన్నారు. ఏమి చర్యలు తీసుకున్నారని న్యాయమూర్తులు అడిగారన్నారు. ప్రిన్సిపాల్‌కు మోమో ఇచ్చామని, వివరణ ఇచ్చిన తర్వాత ఆలోచించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త, కళాశాల ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవిందబాబు, కళాశాల అధ్యక్షుడు విజయకుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుబ్బరాయగుప్త తదితరులు

సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఫీల్డ్‌అసిస్టెంట్‌లకు రికవరీలు విధింపు

శావల్యాపురం, జూలై 26: మండలంలోని కారుమంచి, గుంటుపాలెం, మతుకుమల్లి, శానంపూడి, వేల్పూరు గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి హామీ పనుల్లో బయటపడ్డ వ్యత్యాసాలకు గాను ఫీల్డ్ అసిస్టెంట్‌లకు రూ.75వేలు రికవరీలు విధించినట్లు డ్వామా పీడీ గంగవరపు జోసఫ్ కుమార్ శుక్రవారం తెలిపారు. 17వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా శావల్యాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలస్థాయి ప్రజావేదికను గురువారం నిర్వహించారు. డ్వామాపీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పరిధిలో మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో 2023-24 ఆర్థికసంవత్సరంలో మొత్తం రూ.5.84కోట్లు విలువైన పనులు నిర్వహించడం జరిగిందన్నారు. సామాజిక తనిఖీ సిబ్బంది నిర్వహించిన తనిఖీల్లో ఉపాధధి హామీ పనుల్లో మస్టర్ల తప్పులకు రూ.16,500, పని పూర్తయ్యాక పేర్లు చేర్పులకు రూ.30,951, పని ప్రదేశంలో కొలతల్లో వ్యత్యాసాలకు రూ.39,361, కాలువ కొలతల్లో వ్యత్యాసాలకు రూ.36,438, పూర్తికాని పనులకు రూ.77,456లను ఫీల్డ్ అసిస్టెంట్‌లకు అపరాధ రుసుముగా విధించామని, రూ.1,51,420 పనులను పునఃపరిశీలనకు ఆదేశించించామన్నారు. కారుమంచిలో రూ.27వేలు, గుంటుపాలెంలో రూ.3వేలు, మతుకుమల్లిలో రూ.21వేలు, శానంపూడిలో రూ.6వేలు, వేల్పూరులో రూ.18వేలు చొప్పున ఫీల్డ్ అసిస్టెంట్‌లకు అపరాధరుసుములు విధించామన్నారు. గుంటుపాలెంలో సిమెంట్ రోడ్డుకు రూ.1632 రికవరీ విధించామన్నారు.

మండలంలో మొత్తం 6059 పించన్లు తనిఖీ చేయగా వాటిలో వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులవి 395 పించన్లు రీవెరిఫికేషన్ చేయాలని ఎంపీడీవోకి తెలిపారు. విజిలెన్స్ జిల్లా అధికారి విజయలక్ష్మి, ఎస్ఆర్పీ రాజు, ఎంపీడీవో కవితాచౌదరి, ఏపీవో రామారావు పాల్గొన్నారు.



శావల్యాపురంలో ప్రజావేదికలో పాల్గొన్న పీడీ జోసఫ్‌కుమార్

ఆయిల్ పామ్ సాగు కరపత్రం ఆవిష్కరణ

నరసరావుపేట రూరల్, జూలై 26: ఆయిల్ పామ్ పంట ఎంతో లాభదాయకమని ఆయిల్ ఫామ్‌కు మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్ ఉన్న పంట అని కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. జిల్లా కలెక్టరు కార్యాలయంలో పల్నాడు ఆయిల్ పామ్ సాగు కరపత్రము, ఆయిల్ ఫామ్ సాగుకు సంబంధించి వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ప్రచురించిన రైతు డెయిరీని శుక్రవారం జిల్లా కలెక్టర్ పి. అరుణ్‌బాబు ఆవిష్కరించారు. పల్నాడు జిల్లాలో ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం 8 మండలాలను ఆయిల్ పామ్ సాగుకు అనుమతించగా వీటిలో పిడుగురాళ్ల, బెల్లంకొండ, మాచవరం, రాజుపాలెం, ఈపూరు, అమరావతి మండలాలను వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించటం జరిగిందన్నారు. కార్యక్రమములో వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ యం. రామమోహనరావు, పల్నాడు జిల్లా ఏరియా మేనేజర్ యం. నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాల్లో ఏడీఏ తనిఖీ

నరసరావుపేట రూరల్, జూలై 26: రైతులు లైసెన్స్ కలిగిన పురుగు మందు షాపుల నుంచి పురుగుమందులు కొనుగోలు చేయాలి అని వ్యవసాయశాఖ ఏడీఏ పి.మస్తానమ్మ సూచించారు. శుక్రవారం నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి వినరేంద్రబాబు పట్టణంలోని ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసులను, పురుగు మందుల షాపులను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఏడీఏ పి.మస్తానమ్మ మాట్లాడుతూ ఎవరైనా అనధికారికంగా ఎరువులను గాని పురుగు మందులను గాని విత్తనాలను గాని నిల్వఉంచిన, రైతులకు అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి డీలర్ కూడా స్టాక్ బోర్డులు, ధర పట్టిక రైతులు చూసుకోవడానికి అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో డీఎల్‌డీవో తనిఖీలు

పిచికలపాలెం (శావల్యాపురం) జూలై 26: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేకాధికారుల తనిఖీల్లో భాగంగా మండలంలోని పిచికలపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి మూలె వెంకటరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డుల తనిఖీ అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ గణపర్తి బుల్లబ్బాయి, పంచాయతీ కార్యదర్శి ముంద్రు మనోహర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత, మహిళా పోలీస్ అనంతలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ నడింపల్లి రమాదేవి, ఆయా యోగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల, పూల తోటల పెంపకం రైతులకు లాభదాయకం

నూజెండ్ల, జూలై 26: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకం రైతులకు లాభసాటిగా ఉంటుందని ఎంపీడీవో టీ వీరభద్రాచారి వివరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పండ్ల తోటల పెంపకంపై గ్రామ విలేజ్ అసిస్టెంట్‌లు, ఉపాధి హామీ అధికారులు, సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల, పూల తోటల పెంపకం చేపడితే ప్రతి వారం మొక్కల సంరక్షణకు కూలీ చెల్లించబడుతుందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కిరణ్ కుమార్, ఏపీవో ఆంజనేయ రాజు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్‌లు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



మండల పరిషత్ అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో వసంతరాయుడు

ఒకటినే నూరుశాతం పింఛన్లు పంపిణీ చేయాలి

● జడ్పీ సీఈవో వసంతరాయుడు

యడ్లపాడు, జూలై 26: ఆగష్టు ఒకటో తేదీనే నూరుశాతం పింఛన్లు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో వసంతరాయుడు ఆదేశించారు. శుక్రవారం యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన పింఛన్లు పంపిణీ, పీఎంఏజీవై, పారిశుద్ధ్యంపై అధికారులతో సమీక్షించారు. ముందుగా మండలంలో సామాజిక పింఛన్ల లబ్ధిదారుల సంఖ్య, ఒకటో తేదీనే నూరుశాతం పింఛన్ల పంపిణీకి ఎలాంటి ప్రణాళికలు రూపొందించారో అడిగి తెలుసుకున్నారు. పింఛను పంపిణీ చేసే ఉద్యోగులతో లబ్ధిదారుల మ్యాపింగ్ పూర్తి తదితర అంశాలపై ఆరాతీశారు. ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామయోజన పథకం కింద ఎంపికైన జాలాది గ్రామంలో సర్వే ఎంతమేర పూర్తయింది, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు తదితరాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ పీఎంఏజీవై పథకం క్రింద మండలంలోని జాలాది గ్రామాన్ని ఎంపికచేసి రూ.20లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. సర్వే పూర్తయిందని, వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయవలసి ఉందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వరూధిని, ఏవో శ్రీనివాస్ ఉన్నారు.

ఆధార్ అవసరమైన వారు నమోదు చేయించుకోవాలి: ఎంపీడీవో

ఈపూరు, జూలై 26: ఆధార్ నమోదు అవసరమైన ప్రతిఒక్కరూ చేయించుకోవాలని ఎంపీడీవో ఏవీ రంగనాయకులు అన్నారు. మండలంలోని కొచ్చెర్ల గ్రామంలో శుక్రవారం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ముఖ్యంగా హైస్కూల్ విద్యార్థులు ఉన్నత చదువుల కోసం వెళ్లినప్పుడు ఆధార్ అప్‌డేట్ చేసుకోవడం అవసరమన్నారు.



గుంటుపాలెం వద్ద గండిపడి తెగిపోయిన కాలువకట్ట

కాలువకట్టకు గండిపడి నిలిచిన నీటి సరఫరా

గుంటుపాలెం (శావల్యాపురం) జూలై 26: అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలోని పిట్టంబండ్ల మేజర్ కాలువకట్టకు గుంటుపాలెం శివారు ధర్మపురి సమీపంలో రెండ్రోజుల క్రితం గండిపడడంతో తాగునీరు వృథా అవుతోంది. శుక్రవారం ఉదయం అటువైపుగా పొలాలకు వెళ్ళిన రైతులు గండిపడి ఉండడాన్ని గమనించి పూడ్చేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం సాగర్ జలాలను విడుదల చేయగా కాలువకట్టకు గండిపడడంతో ఈ మార్గంలోని ధర్మపురి, పిట్టంబండ్ల, చెట్టుపల్లి గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. కాలువకట్టకు గండిపడి రెండ్రోజులు గడుస్తున్నా ఎన్నెస్పీ అధికారులు పట్టించుకోవటం లేదని రైతులు వాపోతున్నారు. కాలువకట్టకు గండిపడడంతో పొలాలకెళ్ళే రైతుల రాకపోకలకు అంతరాయంగా మారింది. ఉన్నతాధికారులు గండిని పూడ్పించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

అమ్మవారికి శాకాంబరి అలంకరణ

ఈపూరు, జూలై 26: మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో ఆషాడ మాసం సందర్భంగా వాసవీ కన్యకా సరమేశ్వరీ అమ్మవారిని శుక్రవారం శాకాంబరిగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు.



స్కేటింగ్‌లో సత్తాచాటిన సంసిద్ స్కూల్ విద్యార్థి

కనమర్లపూడి (శావల్యాపురం) జూలై 26: సంసిద్ పాఠశాలకు చెందిన సీనియర్ కేజీ విద్యార్థి భవనాశి వంశీవేదాన్ష్ స్కేటింగ్‌లో రాణిస్తున్నాడని పాఠశాల ప్రిన్సిపాల్ ఒంటేరు నాగసురేష్ తెలిపారు. శావల్యాపురం మండలం కనమర్లపూడి సమీపంలోని సంసిద్ పాఠశాలలో వంశీవేదాన్ష్ అభినందన సభను శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ నాగసురేష్ మాట్లాడుతూ ఇటీవల అమృత్‌సర్‌లో జరిగిన 5వ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్‌లో దేశంలో 5వస్థానాన్ని, గోవాలో జరిగిన 6వ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్‌లో దేశంలో 22వస్థానాన్ని వంశీవేదాన్ష్ కైవశం చేసుకొన్నట్లు తెలిపారు. ఆగస్టు 7నుండి 9వరకు తమిళనాడులో జరగనున్న ఇండియా స్కేటింగ్ గేమ్స్ 2024లో 5-7సంవత్సరాల కేడర్ బాయ్స్ స్పీడ్ ఇన్ లైన్ విభాగంలో స్కేటింగ్ పోటీలకు వంశీవేదాన్ష్ ఎంపికైనట్లు తెలిపారు. వంశీవేదాన్ష్‌ను కోచ్ హరీష్‌నందన్, ఉపాధ్యాయులు అభినందించారు.

పాత కక్షలతో ఒకరిపై దాడి

నాదెండ్ల, జూలై 26: మండలంలోని చందవరంలో పాత కక్షల నేపథ్యంలో ఒకరిపై గురువారం రాత్రి దాడి జరిగింది. ఎస్ఐ బాల రామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చందవరం గ్రామానికి చెందిన పూదోక బాలకృష్ణ, పూదోక కాటంరాజుల మధ్య పాతకక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో రాత్రి 10గంటల సమయంలో బాలకృష్ణ బజారులో ఉండగా పూదోక కాటంరాజు, ఆవుల నరసింహ, వెంకయ్య, శ్రీనులు అతనిపై దాడిచేశారు. ఘటనలో గాయపడ్డ అతన్ని చికిత్సకోసం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



కనపర్రులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి

గ్రామాల్లో ఘర్షణలకు దిగితే చర్యలు

● రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి

నాదెండ్ల, జూలై 26: గ్రామాల్లో ఘర్షణలకు దిగితే కఠినంగా చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని కనపర్రు గ్రామంలో శుక్రవారం సాయంత్రం పోలీసు మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలప్పుడే రాజకీయాలు ఉండాలన్నారు. ఎన్నికల తరువాత ఒకరినొకరు రెచ్చగొటుకున్నా, ఘర్షణలు పడినా సహించేది లేదన్నారు. శాంతియుతంగా సోదర భావంతో అందరూ కలసి జీవించాలని కోరారు. ఆయనతో పాటు ఎస్ఐ జే బాలరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

చిరుమామిళ్ళలో రేషన్ బియ్యం పట్టివేత

● వైసీపీకి అనుకూలంగా అధికార యంత్రాంగం

నాదెండ్ల, జూలై 26: మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 29.50 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. గ్రామంలోని బీసీ కమ్యూనిటీ భవనంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు గురువారం గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం సీఎస్ డీటీ లక్ష్మణరావు, వీఆర్‌వో అనూషలు గ్రామానికి వచ్చారు. బియ్యం నిల్వ ఉన్న గది తాళాన్ని పగలగొట్టే ప్రయత్నం చేయగా వైసీపీ నేత కుమారుడు అడ్డుకన్నాడు. దీంతో రాత్రి ఆ భవనానికి పోలీసులను కాపలాగా ఉంచారు. శుక్రవారం ఉదయం ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆసిఫున్నీసా బేగం సమక్షంలో తాళాలను పగలగొట్టి నిల్వ ఉన్న బియ్యాన్ని గుర్తించారు. గంటల వ్యవధిలోనే ఈ బియ్యం గత డీలర్ నుంచి స్వాధీనం చేసుకున్నామని వీఆర్‌వో చెప్పటం విశేషం. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వీఆర్‌వోలతో జూలైలో బియ్యాన్ని పంపిణీ చేయించారు. ఆ బియ్యాన్ని రైతు భరోసా కేంద్రంలో నిల్వ ఉంచారు. గతంలో నిల్వ ఉన్న బియ్యాన్ని పంచకుండా ఈ నెల కొత్తగా వచ్చిన బియ్యాన్ని పంచటం ఏంటని ప్రశ్నిస్తున్నారు. గతంలో డీలర్ వద్ద ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కమ్యూనిటీ భవనంలో ఉంచగా తాళాలు వీఆర్‌వో దగ్గర లేకుండా ఎక్కడ ఉన్నాయనే ప్రశ్న తలెత్తుతుంది. ఇవి అక్రమ బియ్యం కాదని ఎలాంటి కేసులు లేకుండా సరిపెట్టే ప్రయత్నం చేయటం గమనార్హం. ఈ విషయమై ఇన్‌చార్జ్ తహసీల్దార్‌ను వివరణ కోరగా ఆన్‌లైన్ ప్రకారం 35 క్వింటాళ్ళ ప్రకారం నిల్వ ఉండవలసి ఉండగా 29 క్వింటాళ్ళ బియ్యం మాత్రమే ఉన్నట్టు గుర్తించారు. ఐదు శాతం తరుగు కింద లెక్కలు వేస్తే తేడాలు ఏమీ లేవని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం మారి నెల రోజులు దాటినా గ్రామస్థాయితో పాటు మండల స్థాయి అధికారులు వైసీపీ నేతలకు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి.



చిరుమామిళ్ళలో పట్టుబడ్డ బియ్యం బస్తాలు

పాత చెరుకుంపాలెంలో స్పెషల్ అధికారి ప్రత్యేక పర్యటన

నూజెండ్ల, జూలై 26: మండలంలోని పాత చెరుకుంపాలెంలో గురువారం మండల స్పెషల్ అధికారి, పులిచింతల ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ వరద సుబ్బారావు గ్రామంలో నివాస ప్రదేశాన్ని పరిశీలించి పారిశుధ్యం, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణను ప్రత్యేకంగా పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఆర్‌వో యోగయ్య, పంచాయతీ కార్యదర్శి చిట్టిబాబు ఉన్నారు.

ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో వ్యవసాయ అధికారి తనిఖీలు

చిలకలూరిపేట, జూలై 26: పట్టణంలోని పలు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి శ్రీలత తనిఖీలు నిర్వహించారు. బిల్లులు లేకుండా విత్తనాలు, పురుగు మందులు రవాణాకు సంబంధించి ఆమె ఆరా తీశారు. అలా ఎవరైనా అక్రమ రవాణా చేస్తే తక్షణం వ్యవసాయ అధికారికి తెలియజేయాలని ఆమె కోరారు. అనంతరం ఆమె పట్టణంలోని వివిధ విత్తనాల దుకాణాలను సందర్శించారు. అధిక ధరలకు విత్తనాలు అమ్మినా, నకిలీ విత్తనాలు అమ్మినా తీవ్ర చర్యలు తీసుకుంటామని ఆమె విక్రయ దారులను హెచ్చరించారు. విత్తనాలను అధిక ధరలకు అమ్మితే సెల్ నెంబరు 8331056944కు తెలియజేయాలని కోరారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి: మండల ప్రత్యేకాధికారి రమణారెడ్డి

ఈపూరు, జూలై 26: పిల్లలకు పౌష్టికారం అందించడం వలన వారు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా హార్టీకల్చరల్ అధికారి, మండల ప్రత్యేకాధికారి రమణారెడ్డి అన్నారు. మండలంలోని అగ్నిగుండాల గ్రామంలో శుక్రవారం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలోని పిల్లలకు పెడుతున్న ఆహార పదార్థాలను, రికార్డులను పరిశీలించారు. ప్రతిరోజు పిల్లలకు అందించే ఆహార మెనూను చూశారు. తరువాత బాలింతలు, గర్భిణులకు ఆరోగ్యం గురించి అవగాహన కల్పించారు. ఆయనతోపాటు ఎంపీడీవో ఏవీ రంగనాయకులు, ఈడీపీవో అరుణ, సూపర్ వైజర్ చిన్నమ్మాయి, అంగన్వాడీ కార్యకర్త ఉన్నారు.

నేడు స్టూడెంట్ అండ్ యూత్ కల్చరల్ ఫెస్టివల్

చిలకలూరిపేట, జూలై 26: స్థానిక నరసరావుపేట సెంటర్‌లో ఉన్న గ్రాండ్ వెంకటేష్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉదయం 8గంటలకు పల్నాడు స్టూడెంట్ అండ్ యూత్ కల్చరల్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఏఈ శివయ్య, అంజనేయరాజు శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును ఫెస్టివల్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. అతిథులుగా ఎంఎల్‌సీలు మర్రి రాజశేఖర్, ఏఎస్ లక్ష్మణరావు పాల్గొంటారని తెలిపారు. ఈ ఫెస్టివల్‌లో సింగింగ్, ఫ్యాన్సీ డ్రెస్, ఏకపాత్రాభినయం, క్లాసికల్ డ్యాన్స్ డ్యాన్స్ ఫోక్, మార్షల్ ఆర్ట్స్‌లో జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

నేడు ఆర్టీసీ బస్టేషన్ ఆవరణలో హెల్మెట్‌ల వాడకంపై అవగాహన

చిలకలూరిపేట, జూలై 26: చిలకలూరిపేట ఆర్టీసీ బస్టేషన్ ఆవరణలో శనివారం ఉదయం 11గంటలకు హెల్మెట్‌ల వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాలు నివారణకు సంబంధించి పలు జాగ్రత్తలు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో అవగాహన కల్పిస్తారని ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ నరేంద్రరెడ్డి తెలిపారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్‌లు తిరిగి అందజేత

చిలకలూరిపేట, జూలై 26: పట్టణ పరిధిలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న ఐదుగురికి అర్బన్ పోలీసులు వాటిని రికవరీ చేసి శుక్రవారం అందజేశారు. అర్బన్ సీఐ పీ రమేష్ బాధితులకు పోలీసు స్టేషన్‌లో సెల్‌ఫోన్‌లను వారికి అందజేశారు.



పంచాయతీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా వైద్యాధికారి

డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిబాబు

నాదెండ్ల, జూలై 26: డెంగీ వ్యాధిపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి బాబు పేర్కొన్నారు. మండలంలోని సాతులూరు గ్రామంలోని బొమ్మలాట కాలనీలో నాలుగు రోజుల క్రితం ఒక బాలికకు డెంగీ సోకటాన్ని గుర్తించి చికిత్స కోసం నరసరావుపేట తరలించారు. ఈ సందర్భంగా గ్రామాన్ని సందర్శించిన ఆయన గ్రామంలోని పారిశుధ్య పనులు, తీసుకుంటున్న జాగ్రత్తలపై పంచాయతీ సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామంలో ఇంటింటికి వెళ్ళి ఫీవర్ సర్వే చేయాలన్నారు. దోమల నివారణకు కాలువల్లో మురుగునీరు నిల్వకుండా చూడటంతో పాటు కొబ్బరి బోండాలు, టైర్లు, టబ్బుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాఘవయ్య గ్రామంలో తీసుకుంటున్న పారిశుధ్య చర్యల గురించి వివరించారు. ఆయనతో పాటు ఇన్‌చార్జ్ వైద్యాధికారి ప్రసాదు నాయక్, ఆరోగ్య సిబ్బంది దిలీప్ కుమార్, రాజేశ్వరి, కావేరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు చట్టాలపై అవగాహన

నాదెండ్ల, జూలై 26: హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డపాటి దాసు పేర్కొన్నారు. మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కులకు ఎలాంటి భంగం కలిగినా చట్టపరమైన చర్యలు చేపట్టి హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం, ఆన్‌లైన్‌లో మోసాలు, బాలకార్మిక వ్యవస్థ రద్దు, బాల్య వివాహాల వ్యవస్థ రద్దు తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడపా అశోక్, దరియావలి, వీరాంజనేయులు, కే చందు, ప్రాజెక్టు డైరెక్టర్ ఉమా రాణి తదితరులు పాల్గొన్నారు.